మానవత్వం చాటుకున్న ఆర్కే

విశాలాంధ్ర-మంగళగిరి : ఎమ్మెల్యే ఆర్కే గురువారం ఉదయం రేవేంద్రపాడులో తన పర్యటన ముగించుకుని మంగళగిరి వస్తున్న సమయంలో పెదవడ్లపూడి రైల్వే ఓవర్ బ్రిడ్జి దిగువున ప్రమాదవశాత్తు ఆటో పల్టీ కొట్టింది. అటుగా వెళుతున్న ఎమ్మెల్యే ఆర్కే వెంటనే తన కాన్వాయ్‌ని ఆపి తన సిబ్బందితో కలిసి ఆటోను పైకి లేపి క్షతగాత్రులను రక్షించారు. ఆటోలో ఉన్న 9 నెలల నిండు గర్భిణీ స్త్రీ(ప్రత్తిపాటి లావణ్య) ఉండడంతో వెంటనే తన వాహనంలో తన సిబ్బందితో తెనాలి ప్రభుత్వ ఆసుపత్రికి పంపించారు. ప్రత్తిపాటి లావణ్యను తెనాలి ప్రభుత్వ ఆసుపత్రిలో అత్యవసర విభాగం వైద్యులు పరీక్షించి తన ఆరోగ్య పరిస్థితి బాగానే ఉందని తెలిపారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం

విశాలాంధ్ర-తాడేపల్లి : ఎంటీఎంసీ పరిధిలోని ఇప్పటంలో శ్రీ సీతారామ స్వామి మందిరం కమిటీ ఆధ్వర్యంలో శ్రీ హనుమత్ లక్ష్మణ సమేత సీతారామస్వామి వార్ల నూతన శిలా విగ్రహాముల ప్రతిష్ఠా మహోత్సవం గురువారం అత్యంత వైభవంగా జరిగింది. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని స్వామివార్లను సేవించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. విగ్రహాల ప్రతిష్ట కార్యక్రమంలో ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే భక్తులకు అన్నప్రసాదాన్ని వడ్డించారు. 10 వేల మందికి అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీ సీతా రామస్వామి మందిరం కమిటీ చైర్మన్ మున్నంగి బ్రహ్మ రెడ్డి, కార్యదర్శి అరెగకుటి రవీంద్రారెడ్డి, కోశాధికారి విప్పల రామిరెడ్డి, కమిటీ సభ్యులు మున్నంగి వివేకానంద రెడ్డి, అరేగకుటి అశోక్ రెడ్డి(అడ్వకేట్), శివనాగిరెడ్డి, గుడి నిర్మాణానికి సహకరించిన స్థల దాత మున్నంగి సాంబి రెడ్డి భార్య వెంకాయమ్మ, విగ్రహ దాత వింత సాంబిరెడ్డి, గ్రానైట్ ధాత వీరారెడ్డి(బాబు), తాడేపల్లి తహశీల్దార్ మరిరెడ్డి నాగిరెడ్డి, వైసీపీ నాయకులు బుర్రముక్కు వేణుగోపాలస్వామి రెడ్డి, ఈదులమూడి డేవిడ్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

రూపుదిద్దుకుంటున్న నేతన్న విగ్రహం

విశాలాంధ్ర-మంగళగిరి : ఎన్నారై జంక్షన్ నేతన్న సర్కిల్‌లో త్వరలో ఏర్పాటు చేయనున్న నేతన్న విగ్రహాన్ని ఎమ్మెల్యే ఆర్కే సూచనల మేరకు చేనేత ప్రతినిధుల బృందం రావులపాలెం వెళ్లి ప్రత్యేకంగా పరిశీలించింది. గురువారం ఉదయం ఆటోనగర్‌లోని ఎమ్మెల్యే ఆర్కే కార్యాలయం నుంచి ప్రత్యేక బస్‌లో 20 మంది సభ్యుల బృందం రావులపాలెం వెళ్లి ప్రముఖ శిల్పి వుడయార్ స్వహస్తాలతో రూపుదిద్దుకున్న నేతన్న విగ్రహాన్ని ప్రత్యక్షంగా తిలకించిన ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి ఆశ్చర్య చకితులయ్యారు. నేతన్న విగ్రహాన్ని తనవితీరా తిలకించి.. ఆ మధురస్మృతినీ తమ సెల్ ఫోన్‌లో బంధించి సంతోషం వ్యక్తం చేశారు. అలాగే సంప్రదాయ మగ్గానికి సంబంధించి ప్రతినిధుల బృందం చేసిన చిన్నపాటి సూచనలను శిల్పి వుడయార్ స్వాగతించారు. మంగళగిరి చేనేత నాయకులు ఉన్నారు.

జింకా లక్ష్మయ్యకు ఘన నివాళి

విశాలాంధ్ర-మంగళగిరి : ప్రొద్దుటూరు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ చేనేత నాయకురాలు, పద్మశాలి కార్పొరేషన్ చైర్మన్ జింకా విజయలక్ష్మి తండ్రి జింకా లక్ష్మయ్యకు ఈ నెల 13వ తేదీన అకాల మరణం చెందారు. ఆప్కో చైర్మన్ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర చేనేత విభాగం అధ్యక్షులు గంజి చిరంజీవి గురువారం ప్రొద్దుటూరులోని వారి నివాసంలో ఆయనకు ఘన నివాళి అర్పించారు. వారి కుటుంబాన్ని పరామర్శించి తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆప్కో డైరెక్టర్స్ అవ్వారి యేళ్ళ సుబ్బరాయుడు, వెంకటేశ్వర్లు, గుంటూరు జిల్లా బీసీ నాయకులు పారేపల్లి మహేష్, నియోజకవర్గ చేనేత నాయకులు, వైసీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సత్యానందంకు నివాళి

విశాలాంధ్ర-తాడేపల్లి : ఎంటీఎంసీ పరిధిలోని ఉండవల్లి టీడీపీ సీనియర్ నాయకులు బత్తుల సత్యానందం గురువారం కన్నుమూశారు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి నక్కా ఆనందబాబు, గుంటూరు పార్లమెంట్ టీడీపీ అధ్యక్షులు, తాడికొండ మాజీ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్ తదితరులు సత్యానందం భౌతికకాయాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబానికి ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. మంగళగిరి నియోజకవర్గ టీడీపీ సమన్వయకర్త నందం అబద్దయ్య, తాడేపల్లి మండల టీడీపీ అధ్యక్షులు అమరా సుబ్బారావు, జంగాల సాంబశివరావు, కేసమనేని శ్రీఅనిత, కొమ్మారెడ్డి కిరణ్, దొప్పలపూడి జ్యోతిబసు, పఠాన్ జానీ ఖాన్, కొల్లి సురేష్, కాబోతు దేవదాసు, బత్తుల హరిదాసు, దాసరి కృష్ణ, గాదె శ్రీనివాసరావు(జీఎస్‌ఆర్), రాయపూడి కిరణ్, లాం సరేష్, నామతోటి శ్రీను, ధీకొల్లు చైతన్య, సీపీఎం నాయకులు జొన్నా శివశంకర్, దొంతిరెడ్డి వెంకటరెడ్డి, ఈమని రామారావు, కొర్రప్రోలు ఈశ్వరరెడ్డి, వైసీపీ నాయకులు మహమ్మద్ గోరేబాబు, మేకా దామేశ్వర రెడ్డి తదితరులు ఉన్నారు.

ఇస్రో శాస్త్రవేత్తలకు అభినందనలు

విశాలాంధ్ర-గుంటూరు : చంద్రయాన్-3 ల్యాండర్ చంద్రుని దక్షిణ ధృవంపై విజయవంతంగా అడుగుపెట్టడం వెనుక అహర్నిశలూ శ్రమించిన ఇస్రో శాస్త్రవేత్తలకు, సిబ్బందికి చిల్డ్రన్స్ స్పేస్ క్లబ్ ఆఫ్ ఇండియ వ్యవస్థాపకులు జి.శాంతమూర్తి ఒక ప్రకటనలో అభినందనలు తెలియజేశారు. 2023 జులై 14న శ్రీహరికోటలోని సతీష్ ధావన్ స్పేస్ రీసెర్చ్ సెంటర్ నుంచి ఇస్రో శాస్త్రవేత్తలు ఎల్‌వీఎం-3 ఉపగ్రహ వాహక నౌక ద్వారా ప్రయోగించిన చంద్రయాన్-3 40 రోజుల అనంతరం చంద్రుని దక్షిణ ధృవంపై కాలుమోపడం ఆనందకరమని అన్నారు. ఇది భారతదేశానికి గర్వకారణమని అన్నారు. జాబిల్లి దక్షిణం వైపు అడుగుపెట్టిన తొలిదేశంగా భారత్ అవతరించడంపై హర్షం వ్యక్తం చేశారు.

చంద్రయాన్-3 విజయం హర్షణీయం



విశాలాంధ్ర-గుంటూరు : చంద్రయాన్-3 విజయం సాధించడం యావత్ జాతి హర్షించదగిన విషయమని నేషనలిస్టు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జమీల్ అహ్మద్ బేగ్ అన్నారు. ఇస్రో శాస్త్రవేత్తల నిర్విరామ కృషికి యావత్ ప్రపంచం అభినందనలు తెలియజేస్తుందన్నారు. ఈ సందర్భంగా గుంటూరు జిల్లా నంబూరులోని సిరాజ్ ఉల్ ఉలుమ్ మదర్సాలో చంద్రయాన్-3 విజయోత్సవ వేడుకలను నిర్వహించి అక్కడి చిన్నారులకు స్వీట్లు పంచిపెట్టారు. ఈ సందర్భంగా విద్యార్థులచే జాతీయగీతం ఆలపించి ప్రతిజ్ఞ చేయించారు. చంద్రయాన్-3తో చంద్రుని దక్షిణ ధృవంపై అడుగిడిన తొలి దేశంగా యావత్ ప్రపంచం కొనియాడిందన్నారు. ప్రతి విద్యార్థి స్ఫూర్తిని పొంది శాస్త్ర సాంకేతిక రంగాల్లో పురోగమించాలన్నారు. ఇస్రో శాస్త్రవేత్తల సహకారంతో భారతదేశం మరిన్ని ప్రయోగాల్లో విజయం సాధించి మానవులకు అవసరమైన సాంకేతిక సహకారాన్ని అందించాలని కోరారు.

బస్సుయాత్ర జయప్రదం చేయండి

సీపీఐ నగర కార్యదర్శి కోట మాల్యాద్రి

విశాలాంధ్ర-గుంటూరు : రాష్ట్రాన్ని రక్షించండి... దేశాన్ని కాపాడండి... అనే నినాదంతో సీపీఐ ఆధ్వర్యంలో విశాఖ పట్నంలో ప్రారంభమైన బస్సు యాత్ర ఈ నెల 27వ తేదిన గుంటూరు నగరానికి చేరుకుంటుందని, ఈ సందర్భంగా ఉదయం 11 గంటలకు విజ్ఞాన మందిరంలో జరిగే బహిరంగ సభను జయప్రదం చేయాలని సీపీఐ నగర కార్యదర్శి కోట మాల్యాద్రి పిలుపునిచ్చారు. గుంటూరు మల్లయ్యలింగంభవన్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బస్సు యాత్ర గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాల్యాద్రి మాట్లాడుతూ సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్ అధ్యక్షతన జరిగే సభకు ముఖ్యఅతిథిగా సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ, ఉపన్యాసకులుగా రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు హాజరు కానున్నట్లు వెల్లడించారు. సభ అనంతరం నగరంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించనున్నట్లు వివరించారు. సభకు ముందు, తరువాత ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి కళాకారుల సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మోదీ అధికారంలోకి వచ్చాక దేశంలోని వ్యవస్థలన్ని నిర్వీర్యమైపోయాయని అన్నారు. దళితులు, మైనారిటీలు, వామపక్షాలు, కవులు, కళాకారులపై దాడుల పరంపర కొనసాగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రత్యేక హోదా, విభజన హామీల అమలు, విశాఖ రైల్వే జోన్, కడప ఉక్కు ఫ్యాక్టరీ, వెనుకబడిన ప్రాంతాలకు ప్రత్యేక నిధులు తదితర అంశాలలో మోదీ ప్రభుత్వం రాష్ట్ర ప్రజలకు ద్రోహం చేశారని విమర్శించారు. రాష్ట్రానికి తలమానికంగా నిలిచిన, 32 మంది విద్యార్థుల ప్రాణత్యాగాలు, వామపక్ష ప్రజాప్రతినిధుల పదవీ త్యాగాలతో ఏర్పాటు చేయబడిన విశాఖ ఉక్కు పరిశ్రమను సైతం అమ్మకానికి పెడితే రాష్ట్రంలోని వైసీపీ, టీడీపీ, జనసేన పార్టీలు చోద్యం చేస్తున్నాయని మండిపడ్డారు. ఈ నేపథ్యంలో మోదీ చేసిన దుర్మార్గాన్ని ఎండగట్టడానికి సీపీఐ చేపట్టిన బస్సు యాత్రలో గుంటూరు నగరంలోని సీపీఐ సభ్యులు, వామపక్ష అభిమానులు, ప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఇప్టా జాతీయ కార్యదర్శి గని, సీపీఐ నగర నాయకులు జి.సురేష్‌బాబు, రావుల అంజిబాబు, ఆకిటి అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గిరిజనులకు రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలి

విశాలాంధ్ర-గుంటూరు : రాష్ట్రంలో మైదాన ప్రాంత గిరిజనులు ఎదుర్కొంటున్న సామాజిక, రాజకీయ వివక్షతకు అరికట్టేందుకు నియోజకవర్గాల వారీగా శాసనసభ, పార్లమెంట్ టికెట్లను కేటాయించి వారి హక్కులకు రక్షణ కల్పించాలని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమీషన్ మాజీ సభ్యులు డాక్టర్ కొండారెడ్డి నరహరి వరప్రసాద్ డిమాండ్ చేశారు. జాతీయ ఎస్సీ, ఎస్టీ కమీషన్ ఆఫ్ ఇండియా సెక్రటరీ అల్కా తివారితో పాటు పలువురు లోక్‌సభ, రాజ్యసభ సభ్యులను గిరిజనుల ప్రతినిధి వర్గంతో కలసి డాక్టర్ నరహరి వరప్రసాద్ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత నాలుగు సంవత్సరాలుగా రాష్ట్రంలో గిరిజనుల అభివృద్ధి పూర్తిగా కుంటుపడిందని చెప్పారు. ఏజెన్సీ ప్రాంతాల్లో ఉన్న 25 లక్షల మంది ఎరుకల, లంబాడ తదితర గిరిజన జనాభా వారికి కేటాయించిన ఏడు నియోజకవర్గాలలో తప్పా మైదాన ప్రాంతాలలో ఉన్న 10 లక్షల మంది ఎటువంటి రిజర్వేషన్లకు నోచుకోలేదన్నారు. గిరిజనులు నివసించే ప్రాంతాలలో మౌలిక సౌకర్యాలను మెరుగుపరచకుండా వారి అభివృద్ధికి దోహదపడే సంక్షేమ పథకాలు రద్దు చేయడంతో పాటు సబ్ ప్లాన్ నిధులను నవరత్నాలకు మళ్ళించి వారి అభివృద్ధిపై తీవ్రంగా దెబ్బకొట్టారని అన్నారు. రాబోవు శాసనసభ, పార్లమెంటు ఎన్నికల సందర్భంగా త్వరలో గ్రామ, మండల, జిల్లా స్థాయి గిరిజన కమిటీలను బలోపేతం చేసి ఎరుకల ఇతర గిరిజనుల హక్కుల సాధన కోసం ప్రజా ఉద్యమాలు నిర్మిస్తామని తెలియజేశారు. కార్యక్రమంలో తోకల నాగభూషణం, బండి రాజేష్, కుంభా రేణుక, మేడా రామకృష్ణ, కుంభా రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

నిర్ణీత గడువులోగా సర్వేలు చేపట్టాలి

విశాలాంధ్ర-మంగళగిరి : నగరపాలక సంస్థ పరిధిలో నిర్ణీత గడువులోగా సర్వేలు చేపట్టి ప్రజామన్ననలను పొందాలని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి అన్నారు. గురువారం ఆయన ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావుతో కలిసి కార్పొరేషన్ పరిధిలోని సచివాలయాల సర్వేయర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్కే మాట్లాడుతూ ప్రజలు స్థలాలు, పొలాల సర్వేకు సంబంధించి ఇబ్బందులు పడుతున్నారని, కొందరు దరఖాస్తుదారులు స్పందన కార్యక్రమంలో కూడా ఫిర్యాదులు చేశారని గుర్తుచేశారు. మంగళగిరి మండల, అర్బన్ సర్వేయర్ పోస్టులు గత కొన్ని నెలలుగా ఖాళీగా ఉన్న నేపథ్యంలో ఆయా పోస్టులు భర్తీ చేయాలని కమిషనర్ ల్యాండ్ సర్వేయర్స్ సిద్ధార్థ జైన్‌ను ఇటీవల కోరామన్నారు. స్పందించిన ఆయన మంగళగిరి రూరల్ సర్వేయర్ పోస్టును భర్తీ చేశారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా భూ సర్వే జరుగుతున్న నేపథ్యంలో ల్యాండ్ సర్వేయర్ల కొరత ఉందని, దీంతో ప్రస్తుత మండల సర్వేయరే కార్పొరేషన్ ఇన్‌ఛార్జి సర్వేయర్‌గా కొనసాగనున్నారని తెలిపారు. జిల్లా కలెక్టర్ మాట్లాడటం జరిగిందని, ఒకటి రెండు రోజుల్లో ఇందుకు సంబంధించిన ఆర్డర్ రానుందన్నారు. కార్పొరేషన్ పరిధిలో పెండింగ్‌లో ఉన్న సుమారు 200 సర్వే దరఖాస్తులను వచ్చే నెల 5వ తేదీ నాటికి పరిష్కరించాలని, ఇకపై సర్వే కోసం నూతనంగా వచ్చే దరఖాస్తులను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని సూచించారు. ఈ సమావేశంలో మంగళగిరి-తాడేపల్లి తహశీల్దార్లు జీవీ రామ్‌ప్రసాద్, నాగిరెడ్డి, ఏసీపీ వెంకటేశ్వర్లు, మండల సర్వేయర్ హనుమంతరావు పాల్గొన్నారు.

బస్సు యాత్ర జయప్రదం చేయండి

విశాలాంధ్ర-దుగ్గిరాల : భారత కమ్యూనిస్టు పార్టీ పిలుపులో భాగంగా రాష్ట్రాన్ని రక్షించండి... దేశాన్ని కాపాడండి... అనే నినాదంతో విశాఖపట్నం నుంచి తిరుపతి వరకు బస్సు యాత్రలో భాగంగా ఈ నెల 26న మంగళగిరి అంబేద్కర్ విగ్రహం వద్ద జరగనున్న బహిరంగ సభలో వామపక్షాలు, సీపీఐ కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని మంగళగిరి నియోజకవర్గ సీపీఐ కార్యదర్శి చిన్నితిరుపతయ్య కోరారు. మండల పరిధిలోని రేవేంద్రపాడు గ్రామంలో గురువారం బస్సు యాత్ర వాల్స్‌పోస్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మంగళగిరి పట్టణ కార్యదర్శి జాలాది జన్ బాబు, నియోజకవర్గ నాయకులు యార్లగడ్డ శివయ్య, సింహాద్రి వెంకటేశ్వరరావు, శేఖర్ సూరిబాబు, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గంలో ఎమ్మెల్యే పర్యటన

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : తూర్పు నియోజకవర్గంలోని నాగరాజు కాలనీ, సంజీవయ్య నగర్ రైల్వే ట్రాక్ పరిసర ప్రాంతాల్లో ఎమ్మెల్యే మహమ్మద్ ముస్తఫా గురువారం పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికుల నుంచి సమస్యలు అడిగి తెలుసుకుని ఎటువంటి సమస్యలు ఉన్నా మా దృష్టికి తీసుకురావాలని కోరారు. అలాగే డ్రైనేజ్ లీక్‌లు...వర్షాలకు దెబ్బతిన్న రోడ్లను పరిలించి సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్ళి దెబ్బతిన్న రోడ్లను తక్షణమే మరమ్మతులు చేయించాలని అధికారులకు ఆదేశించారు. ఈ పర్యటనలో 54వ డివిజన్ నాయకులు అగ్గిపెట్టి రాజు, వార్డు ప్రెసిడెంట్ దాస్, జీఎంసీ సిబ్బంది పాల్గొన్నారు.

సుస్థిర పద్ధతులతోనే రైతన్నకు రాబడి

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: సుస్థిర వ్యవసాయ పద్ధతులతోనే రైతన్నలు మరింతగా రాబడి పొందగలుగుతారని బెస్ట్ ఆగ్రో లైఫ్ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ విమల్ కుమార్ అలవాది పేర్కొన్నారు. స్థానిక కన్వెన్షన్ హాల్లో సంస్థకు సంబంధించిన నూతన శిలీంద్రనాశిని ట్రైకలర్ ఆవిష్కరణ కార్యక్రమం, డిస్ట్రిబ్యూటర్ల సమావేశం జరిగింది. ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎస్.బి.వి.ఆర్ ప్రసాద్, స్ట్రాటజిక్ అండ్ బిజినెస్ అలెన్స్ ఉపాధ్యక్షుడు సతీష్ కుమార్ మల్హోత్రా, నేషనల్ మార్కెటింగ్ మేనేజర్ సారా నరసయ్య తదితరులు కార్యక్రమంలో పాల్గొని పంపిణీ దారులను ఉద్దేశించి మాట్లాడారు. అన్ని రకాల పంటలో వచ్చు వివిధ రకాల మొండి తెగుళ్ళను ట్రై కలర్ సమర్ధవంతంగా నియంత్రిస్తుందని వివరించారు. భారతదేశానికి వ్యవసాయం ఎంతో కీలకమైనదని, రైతన్నలకు మేలు చేసే విధంగా పంపిణీదారులు కృషి చేయాలని పేర్కొన్నారు.

గెలుపే లక్ష్యంగా కృషి చేయాలి

విశాలాంధ్ర-గుంటూరు : రానున్న ఎన్నికల్లో టీడీపీ గెలుపే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలని టీడీపీ గుంటూరు నగర అధ్యక్షులు డేగల ప్రభాకర్ అన్నారు. వైసీపీ పాల నలో రాష్ట్ర ప్రజలు అష్టకష్టాలు పడుతున్నారని చెప్పారు. గురువారం అర్బన్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ముఖ్యనాయకుల సమావేశంలో ఆయన మాట్లా డుతూ నవరత్నాల పేరుతో రాష్ట్ర ప్రజలను రోడ్డున పడేశారని ఆవేదన వ్యక్తం చేశారు. అభివృద్ధిని గాలికొదిలేసి అక్రమ ధనార్జన లక్ష్యంగా వైసీపీ నాయకులు వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. వచ్చే ఎన్నికల్లో జగన్ రెడ్డి నిజాయితీగా గెలిచే ధైర్యం లేక అక్రమంగా ఓట్లను తొలగిస్తూ, దొంగ ఓట్లను సృష్టిస్తున్నారని మండిపడ్డారు. తెలుగుదేశం పార్టీ చేపట్టిన భవిష్యత్తుకు గ్యారెంటీ మహాశక్తి కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లాలని పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. అధికార దాహంతో అలివికాని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన జగన్ ప్రభుత్వం రాష్ట్రాన్ని నట్టేటముంచేశారన్నారు. యువగళం పాదయాత్ర రాష్ట్ర రాజకీయాల్లో ఒక మైలురాయిగా జరుగుతుందన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని తిరిగి అభివృద్ధి పట్టాలపై ఎక్కించి అన్ని వర్గాలకు చేయూతనిచ్చి ముందుకు నడిపించే విధంగా తెలుగుదేశం పార్టీ బాధ్యత తీసుకుంటుందన్నారు. అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా తెలుగుదేశం పార్టీ పనిచేస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో కొత్తూరు వెంకట్, తాడివాక సుబ్బారావు, షేక్ కరిముల్లా, ఎర్రగోపు నాగేశ్వరరావు, రవి, బండ్లమూడి మధు, కొండేపు శేఖర్, ఎదల రమేష్, బొక్కిసం శివరాం, పర్చూరి రాము, నారాయణరెడ్డి, ఉప్పు శీను తదితరులు పాల్గొన్నారు.

చంద్రుడిపై విజయ బావుటాపై హర్షం

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : చంద్రుడిపై భారత్ విజయ బావుటా ఎగురవేయటం పట్ల అవగాహన సంస్థ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. గురువారం కార్యాలయంలో ప్రత్యేక కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి మాట్లాడుతూ దేశం సాధించిన చంద్రయాన్-3 మహత్తర విజయాన్ని కోట్లాది మంది భారతీయులు ప్రత్యక్ష ప్రసారాల ద్వారా చూసి ఉత్తేజితులయ్యారన్నారు. చంద్రయాన్-3 ల్యాండింగ్‌లో మన శాస్త్రవేత్తలు చరిత్ర సృష్టించారని, అద్భుత కృషిలో భాగస్వాములైన ఇస్రో శాస్త్రవేత్తలను దేశం మొత్తం సలాం చేస్తుందన్నారు. సీనియర్ ఇంజనీర్ సదాశివన్ మాట్లాడుతూ ఇస్రో విజయం అద్భుతమని, ఆరు దశాబ్దాల సుదీర్ఘ అంతరిక్ష కార్యక్రమంలో మరో మహత్తర ఘట్టాన్ని వీక్షించిన ప్రజల హృదయం ఉప్పొంగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భారత్ కీర్తి పతాకను సగర్వంగా ఎగురవేసిన ఇస్రోకి ప్రపంచం నలుమూలల నుంచి అభినందనలు వెల్లువెత్తుతున్నాయని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మల్లేశ్వరరావు, మురళీకృష్ణ, వెంకటరత్నం తదితరులు ఉన్నారు.

ఔట్‌సోర్సింగ్ కార్మికులకు సీఎం వంచన

విశాలాంధ్ర-గుంటూరు : ఔట్‌సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేస్తానని, అప్పటివరకు సమాన పనికి సమాన వేతనం ఇస్తానని ప్రతిపక్ష నేతగా హామి ఇచ్చిన జగన్‌మోహన్ రెడ్డి నేటికి ఆ హామీని నెరవేర్చకుండా మున్సిపల్ ఔట్‌సోర్సింగ్ కార్మికులను నయవంచనకు గురిచేశారని ది ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మున్సిపల్ ఇంజనీరింగ్ టౌన్ ప్లానింగ్ అండ్ శానిటేషన్ వర్కర్స్ ట్రేడ్ యూనియన్ అధ్యక్షులు ఈదులమూడి మధుబాబు, ది గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ శానిటేషన్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు సోము శంకరరావు అన్నారు. ది గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ ఇంజనీరింగ్ టౌన్ ప్లానింగ్ అండ్ శానిటేషన్ వర్కర్స్ ట్రేడ్ యూనియన్, ది గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ శానిటేషన్ వర్కర్స్ ట్రేడ్ యూనియన్ సంయుక్తంగా గుంటూరు నగరపాలక సంస్థ ఎదుట గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇప్పటికైనా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి స్పందించి మున్సిపల్ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని, అప్పటివరకు సమాన పనికి సమాన వేతనం ఇచ్చి మున్సిపల్ కార్మికుల కుటుంబాలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అంతేకాకుండా నగరపాలక సంస్థలో పారిశుద్ధ్యం, ఇంజనీరింగ్, టౌన్ ప్లానింగ్ విభాగాలలో రాట్ ఫిక్కర్స్, బదిలీ కార్మికులతో కలిపి మూడు వేల మంది ఔట్‌సోర్సింగ్ పద్ధతిపై విధులు నిర్వహిస్తున్నారని వీరందరికీ కూడా బ్యాంకుల ద్వారా వ్యక్తిగత రుణాలు ఇప్పించాలని కోరారు. అయితే దీనికి సంబంధించి ఒక వినతిపత్రాన్ని మేయర్‌కు యూనియన్ ఆధ్వర్యంలో అందజేశామని, ఈ నెల 11న మేయర్ ఆ వినతిపత్రాన్ని కమిషనర్‌కు సిఫార్సు చేస్తూ బ్యాంక్ అధికారులకు రిక్వెస్ట్ లెటర్ ఇవ్వవలసిందిగా కోరారన్నారు. ఇంతవరకు కమిషనర్ ఆ వినతిపత్రం మీద ఎటువంటి చర్యలు తీసుకోలేదని అన్నారు. మేయర్ సిఫార్సును కూడా లెక్కచేయకుండా కమిషనర్ ప్రవర్తించడం సరైన పద్ధతి కాదన్నారు. ప్రతినెల మూడో శుక్రవారం వర్కర్స్ గ్రీవెన్స్ నిర్వహించాలని డిమాండ్ చేసినప్పటికీ కమిషనర్ ఈ గ్రీవెన్స్‌ని నిర్వహించడం లేదని అన్నారు. ఈ కార్యక్రమానికి జనసేన నాయకులు గాదె వెంకటేశ్వరరావు, నేరెళ్ల సురేష్, ఆళ్ల హరి తదితరులు మద్దతు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మేకతోటి రామదాసు, నాగిపోగు సుమన్, యాకోబు ఏసుబాబు, సుదీర్, స్వామి, ఉదయ్ కుమార్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

జానపద గీతాల పరిరక్షణ అవసరం

విశాలాంధ్ర-తెనాలి : జానపద గీతాలకు పునాది జనపదమని, జనం ఏమీ మాట్లాడుకుంటారో, ఎలా కబుర్లాడుకుంటారో వారి జీవితం ఏ అంశం చుట్టూ తిరుగుతుందో, అవన్నీ జానపద గీతాల్లో గాయకులు గానం చేస్తారని గాయకుడు దేవరపల్లి నీలాంబ్రం చెప్పారు. ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి ఆధ్వర్యంలో గురువారం గాంధీనగర్‌లో బొల్లిముంత ఫౌండేషన్ హాలులో జరిగిన ప్రపంచ జానపద దినోత్సవ వేడుకల కార్యక్రమంలో మాట్లాడారు. సభకు గుంటూరు జిల్లా ప్రజానాట్యమండలి అధ్యక్షులు బొల్లిముంత కృష్ణ అధ్యక్షత వహించారు. నీలాంబ్రం మాట పాట ద్వారా మాట్లాడుతూ ప్రజల నమ్మకాలు, విశ్వాసాలు, ప్రేమలు, అనురాగాలు, కోపాలు, తాపాలు, అలకలు, చిన్నబుచ్చుకోవడాలు, యివన్నీ జానపద గేయాల్లో వచ్చే అంశాలుగా ప్రస్తావించారు. నాట్లు వేసే సమయంలో "రావే రావే నల్లతుమ్మెద" అంటూ, నూర్పిడి సమయంలో "వలియో వలియో రావేలు గల వాడ రారా పొలిగాడా అంటూ, బంతిమాలు బంతిమాలు ఉయ్యాలో అంటూ ఆనందంతో పాడుతారని చెప్పారు. అధ్యక్షత వహించిన బొల్లిముంత కృష్ణ మాట్లాడుతూ ప్రజల భాషే జానపదం అని ఇప్పుడొచ్చే అనేక రూపాలకు మాతృక జానపదం అన్నారు. ప్రజలకు ఎప్పుడూ చేరువగా వుండేది జానపద గీతాలన్నారు. జానపద గీతాల్లో వున్న సంస్కృతిని పరిరక్షించాల్సిన అవసరం నేడు వుందన్నారు. జానపద రూపాలను ప్రజలే బతికించుకోవాలన్నారు. ప్రజలు ప్రభుత్వం సరైన విధంగా స్పందించి తగు చర్యలు చేపట్టాలన్నారు. తెలుగుజాతి వైభవానికి ప్రతీకలు జానపద కళలుగా పేర్కొన్నారు. సాహిత్య సంగీత రంగాల్లో జానపద సాహిత్యానికి ఒక ప్రత్యేకత వుందన్నారు. జానపదాలలో రకరకాల చందోరీతులు, ధోరణులు కనిపిస్తాయి వినిపిస్తాయన్నారు. జానపదాలలో సంగీత, సాహిత్య పటిమ స్థిరస్థాయిగా వుండాలన్నారు. రచయితలు, సాహితీ వేత్తలు తమతమ రచనల ద్వారా జానపద సాహిత్యాన్ని తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ జానపద గేయాలను ప్రజానాట్యమండలి వెలుగులోకి తెచ్చిందని గుర్తు చేశారు. సంగీత అధ్యాపకురాలు నేరెళ్ల కళ్యాణి మాట్లాడుతూ ప్రజల సాహిత్యమంటే జానపద సాహిత్యమేనన్నారు. జానపద కళారూపాల అధ్యయనం అవసరమని పేర్కొన్నారు. బుర్రకథ, హరికథ, బతుకమ్మ పాటలు, పల్లె సుద్దులు, తోలుబొమ్మలాటలు, తప్పెటగుళ్ళు, డప్పుల నృత్యం, భజనలు, కోలాటాలు, బుట్టబొమ్మలు, సప్తతాళ భజనలు, ఇలా 150 జానపద రూపాలున్నాయని వాటిని పరిరక్షించడం మనబాధ్యత అన్నారు. కార్యక్రమంలో జానపద నృత్యాలు, జానపద గేయాలు ప్రేక్షకులను అలరించాయి.

విశాలాంధ్ర గుంటూరు జిల్లా

కొలకలూరులో గడపగడపకు మన ప్రభుత్వం

విశాలాంధ్ర-తెనాలి : మండలంలోని కొలకలూరు గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం గురువారం 4వ రోజు రథం బజారులో జరిగింది. ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాల ద్వారా ప్రజలు లబ్ది పొందారని చెప్పారు. గత ప్రభుత్వంలో అధికారం కోసం పథకాలు ప్రవేశపెట్టి ఇచ్చిన హామీలను తుంగలో తొక్కారని, కానీ జగనన్న ఇచ్చిన మాటకోసం ఎన్ని అవాంతరాలు వచ్చినా ఎదుర్కొని ఈ పథకాలను అమలు పరిచారని తెలిపారు. కరోనా మహమ్మారి, గత ప్రభుత్వం వదిలి వెళ్లిన అప్పులు, ప్రకృతి భీభత్సాన్ని సైతం తట్టుకొని ప్రజలకు మేలు చేస్తున్న జగనన్న మంచి మనస్సు దూరదృష్టి మరెవ్వరికీ లేదని కితాబిచ్చారు. జరగబోయే ఎన్నికల్లో కూడా జగనన్న ప్రభుత్వాన్ని గెలిపించి ప్రజలు జగనన్న సేవలను అందుకోవాలని ఆకాంక్షించారు. చెన్నుబోయిన శ్రీనివాసరావు, కోడూరి స్వప్న, రమేష్, దోసపాటి నాగదేవి, చక్కా సీతమ్మ, పార్టీ నాయకులు, కార్యకర్తలు, వాలంటీర్లు, సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో రక్తనిల్వల కేంద్రం

విశాలాంధ్ర-తెనాలి : పాత ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంగణంలో రక్తనిల్వ కేంద్రం ఏర్పాటు చేయనున్నట్లు మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఖాలేదా నసీం చెప్పారు. శంకుస్థాపన సందర్భంగా ఆమె మాట్లాడారు. సుమారు 72 లక్షల వ్యయంతో సివిల్ పనులను ప్రారంభిస్తూ దసరా నాటికి సెంటర్‌ను ప్రారంభిస్తామని అన్నారు. రక్తం కావలసిన రోగులు విజయవాడ, గుంటూరుల చుట్టూ తిరుగుతూ నానా ఇబ్బందులు పడుతున్నారని, ఈ రక్తదాన కేంద్రం ద్వారా ప్రజలను కాపాడవచ్చని అన్నారు. రెడ్‌క్రాస్ సబ్ బ్రాంచ్ ఛైర్‌పర్సన్ భానుమతి మాట్లాడుతూ రక్తం అవసరమైన రోగికి సంబంధిత వైద్యుడు సిఫార్సు చేసిన గ్రూపు సూచిస్తే రక్తం తీసుకెళ్ళవచ్చన్నారు. ఇక్కడ రక్తకేంద్రానికి స్థలం ఇచ్చిన తెనాలి శాసనసభ్యులు అన్నాబత్తుని శివకుమార్‌కు ధన్యవాదాలు తెలిపారు. మున్సిపల్ వైస్‌ఛైర్మన్ మాలేపాటి హరిప్రసాద్ మాట్లాడుతూ తెనాలిలో రక్తదాన కేంద్రం ఉండటం ప్రజలకు ఎంతో ఉపయోగకరమని చెప్పారు. కార్యక్రమంలో వైద్యులు డా.పావనీప్రియ, డా.బీబీజాన్, కౌన్సిలర్ కుర్రా సుజాత, కుర్రాశ్రీను, జవ్వాజి శ్రీను, చుండూరు శాయి, లక్ష్మణరావు, కోశాధికారి నాళం శ్రీమన్నారాయణమూర్తి పాల్గొన్నారు.

అరసం జాతీయ అధ్యక్షులు పెనుగొండకు అభినందనలు

విశాలాంధ్ర-తెనాలి : అఖిల భారత అభ్యుదయ రచయితల సంఘం జాతీయ అధ్యక్షునిగా ఏకగ్రీవంగా ఎన్నికైన గుంటూరు జిల్లా వాసి న్యాయవాది, రచయిత విమర్శకుడు, పెనుగొండ లక్ష్మీనారాయణకు ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షుడు బొల్లిముంత కృష్ణ అభినందనలు తెలిపారు. జాతీయకార్యవర్గ సభ్యులుగా ఎన్నికైన రాచపాళెం చంద్రశేఖరరెడ్డి, వల్లూరి శివప్రసాద్‌లకు జాతీయ సభలో పాల్గొన్న జిల్లా అధ్యక్షులు చెరుకుమల్లి సింగారావు, అభ్యుదయ కళా సమితి, తెనాలి, ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి, తెనాలి, తెనాలి కల్చరల్ ఫిలిం సొసైటీ, బొల్లిముంత శివరామకృష్ణ ఫౌండేషన్, అరసం సంస్థలు హర్షాన్ని వ్యక్తం చేశాయి. అరసం, తెనాలి నాయకులు కనపర్తి బెన్‌హర్, శాంతిసంఘాల నాయకులు అబ్రహం లింకన్, ప్రజ్యానాట్యమండలి జిల్లా కార్యదర్శి దేవరపల్లి నీలాంబ్రం, వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షులు తుంగా బాలస్వామి, ఇస్కఫ్ నాయకులు శ్రీదేవి, బెజ్జంకి నాగమణి, విజయలక్ష్మి, విజయదుర్గ, గురుబ్రహ్మం, శ్రీకాంత్‌లు వేర్వేరు ప్రకటనలలో అభినందనలు తెలియజేశారు.

విజ్ఞాన్స్‌లో పీజీ డిప్లమో-బయోటెక్నాలజీ కోర్సు ప్రారంభం

విశాలాంధ్ర-గుంటూరు : విజ్ఞాన్స్ యూనివర్సిటీలో పీజీ డిప్లమో ఇన్ బయోటెక్నాలజీ కోర్సును ప్రారంభిస్తున్నామని వర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ పి.నాగభూషణ్ గురువారం తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పీజీ డిప్లమో ఇన్ బయోటెక్నాలజీ కోర్స్‌కు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. బీఎస్సీ లైఫ్ సైన్సెస్(బోటనీ, జూవాలజీ, మైక్రో బయోలజీ, బయోటెక్నాలజీ, బయోకెమిస్ట్రీ) పూర్తిచేసిన విద్యార్థులు ఈ కోర్సుకు దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. మారుతున్న ఇండస్ట్రీ అవసరాలకు అనుగుణంగా బీఎస్సీ పూర్తిచేసిన విద్యార్థులను తీర్చిదిద్దటానికే ఈ కోర్సును డిసెంబర్ నుంచి ప్రారంభిస్తున్నామన్నారు. పీజీ డిప్లమో ఇన్ బయోటెక్నాలజీ కోర్సును పూర్తి చేసిన విద్యార్థులు బీటెక్ బయోటెక్నాలజీ కోర్సుతో సమానమవుతారన్నారు. దీని ద్వారా బయోటెక్నాలజీలో ఎంటెక్ లేదా ఎంఎస్ ప్రోగ్రామ్స్ చేయదానికి అర్హత సాధిస్తారని తెలియజేసారు. చివరి సెమిస్టర్‌లోని ఇంటర్న్‌షిప్ ప్రోగ్రామ్ ద్వారా ప్రముఖ బయోటెక్నాలజీ కంపెనీలలో ఉద్యోగ అవకాశాలు పొందవచ్చునని వెల్లడించారు. ఆసక్తిగల అభ్యర్థులు వివరాలకు 9000390204, 8019963972 సంప్రదించవచ్చునని తెలియజేసారు.

హెల్త్ ఇన్సూరెన్స్ తప్పనిసరి

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : నేడు వైద్య ఖర్చులు అధిక భారతమవుతున్న నేపథ్యంలో మన దేశంలోని సామాన్య, మధ్య తరగతి ప్రజలు పాశ్చాత్య దేశాల్లో మాదిరిగా హెల్త్ ఇన్సూరెన్సులు కలిగి ఉండాలని సర్వీస్ హెల్త్ ఆర్గనైజేషన్ (ఎస్‌హెచ్‌ఓ)అధ్యక్షులు డాక్టర్ టి.సేవకుమార్ అన్నారు. స్థానిక బ్రాడిపేటలోని ఎస్‌హెచ్‌ఓ మీటింగ్ హాల్లో టాటా ఏఐజీ ఇన్సూరెన్స్, ఎస్‌హెచ్‌ఓ సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన 'హెల్త్ ఇన్సూరెన్స్ బ్రోచర్ ఆవిష్కరణ- అవగాహన సభ'కు డాక్టర్ సేవకుమార్ అధ్యక్షత వహించి మాట్లాడారు. ప్రాణాంతక అంటు వ్యాధులు, బీపీ, షుగర్, క్యాన్సర్ వంటి జీవనశైలి వ్యాధులు పెరిగి సామాన్యుల, మధ్య తరగతి కుటుంబాలను పేదరికంలోకి నెట్టేస్తున్నాయని, అందుకు హెల్త్ ఇన్సూరెన్స్ లేకపోవడమేనన్నారు. హెల్త్ ఇన్సూరెన్స్ లేకపోవడం వల్ల వైద్య చికిత్స కోసం అప్పులపాలవుతున్నారని ప్రపంచ ఆరోగ్య సంస్థ కూడా నిర్ధారించిందన్నారు. తొలుత హెల్త్ ఇన్సూ రెన్స్‌పై ఎస్‌హెచ్‌ఓ ప్రచురించిన కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమం లో టాటా ఏఐజీ ఏరియా మేనేజర్ పి.మొహమ్మద్ ఖాన్, డాక్టర్ తూములూరి రాజేంద్రప్రసాద్, ఎస్‌హెచ్‌ఓ మేనేజర్ పి.నిర్మల రాణి, ధర్మ గ్రూప్ ఆఫ్ సర్వీసెస్, మేనేజర్ చిగురుపాటి శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు వెంటనే పరిష్కరించండి

విశాలాంధ్ర-తాడికొండ : మండల పరిధిలో ప్రజలు తీసుకువచ్చే సమస్యలను సంబంధిత అధికారులు తక్షణమే పరిష్కరించాలని వైసీపీ తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్ కోరారు. గుంటూరు నగరంలోని నియోజవర్గ పార్టీ కార్యాలయంలో తహశీల్దార్లు, జేసీఎస్ కన్వీనర్లు, ముఖ్య నాయకులతో గురువారం సమావేశాన్ని నిర్వహించారు. నియోజకవర్గంలో ఎక్కువగా ఇళ్ల స్థలాల అర్జీలు వస్తున్నాయని వాటిని అక్కడికక్కడే పరిష్కరించాలని సూచించారు. అర్హులైన ప్రతిఒక్కరికి ఓటు హక్కు కల్పించాలని కోరారు. ప్రజాసమస్యల పట్ల అధికారులు అప్రమత్తంగా ఉండాలని అన్నారు.

విశాలాంధ్ర పల్నాడు జిల్లా

సీపీఐ బహిరంగ సభ జయప్రదం చేయాలి

విశాలాంధ్ర-వినుకొండ: రాష్ట్రాన్ని రక్షించండి దేశాన్ని కాపాడండి అనే నినాదంతో సీపీఐ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా బస్సు యాత్ర నేపథ్యంలో ఈనెల 27న సాయంత్రం ఐదు గంటలకు వినుకొండ రానున్నది. ఈ సందర్భంగా వారికి స్వాగతం పలుకుతూ పట్టణంలో ప్రధాన సెంటర్లలో భారీ ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. సీపీఐ వినుకొండ నియోజకవర్గ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక శివ స్తూపం సెంటర్‌లో జరిగే భారీ బహిరంగ సభకు ప్రజలు ప్రజాసంఘాలు కార్మిక సంఘాలు నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని బహిరంగ సభను జయప్రదం చేయాలని నియోజకవర్గ కమిటీ విజ్ఞప్తి చేసింది.

అవార్డు గ్రహీతకు సన్మానం

విశాలాంధ్ర-దుర్గి : మండల తహశీల్దార్ కార్యాలయంలో డేటా ఎంట్రీ ఆపరేటర్‌గా పనిచేస్తున్న మంగళగిరి అనిల్ శాస్త్రికి స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఉత్తమ కంప్యూటర్ ఆపరేటర్ అవార్డుకు ఎంపిక చేసి కలెక్టర్ నుంచి ప్రసంసాపత్రం అందుకున్న సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా గురువారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ రమేష్ కుమార్ అధ్యక్షతన ఆయన్ను శాలువాతో సన్మానించారు. వీఆర్వోలు జీరయ్య, రంగారావు, కోటేశ్వరరావు, గంగమ్మ, పద్మావతి, తులసీనాయక్, సోమ్లనాయక్, నియోజకవర్గ ఆపరేటర్లు సైదాబి, చంద్రం, మధు, జాని, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

సూరే రంగయ్యకు నివాళి

విశాలాంధ్ర-అచ్చంపేట : ఇటీవల గుండెపోటుతో మృతి చెందిన సూరే రంగయ్య చిత్రపటానికి జై భీమ్ భారత్ పార్టీకి చెందిన పలువురు నాయకులు నివాళులర్పించారు. అచ్చంపేట మండలం వేల్పూర్ గ్రామంలో గురువారం మధ్యాహ్నం ఆదరణ కూడిక జరిగింది. ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, న్యాయవాది జొన్నలగడ్డ విజయ్ కుమార్ పాల్గొని మాట్లాడారు. ఆయన సేవలను స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. రంగయ్య ఇద్దరు కుమారులు సూరే రాంబాబు, గోపీలు పోలీస్, అగ్నిమాపక శాఖ ఉదోగాల్లో చేరి సమాజానికి సేవ చేస్తూ తండ్రి వలే ఇతరులకు ఆదర్శంగా ఉన్నారని కొనియాడారు. తొలుత రంగయ్య చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు మాంతగి సుధాకర్‌రావు, నాయకులు రామారావు, జడ కమల్ కుమార్, మహంకాళి వెంకట్రావ్, మాలే పద్మారావు, కొరబండి రాబర్ట్, మాలపాటి దేవరాజ్ తదితరులు పాల్గొన్నారు.

తీర్థయాత్రికులకు శుభవార్త..



విశాలాంధ్ర-వినుకొండ: ఆగష్టు 31వ తేదీన అనగా మహాపౌర్ణమి గురువారము సుప్రసిద్ద అరుణాచలం స్వామి వారి దర్శనం మరియు గిరిప్రదక్షిణం చేసుకొను మహా అవకాశం కొరకు మన వినుకొండ డిపో నుండి ప్రత్యేక సూపర్ లగ్జరీ బస్సులు ఏర్పాటు చేసినట్లు డిపో మేనేజర్ శ్రీ బి.కోటేశ్వరరావు నాయక్ తెలిపారు. ఆగస్ట్ 29వ తేది రాత్రి 9గంలకు బయల్దేరి 30వ తేది ఉదయం శ్రీకాళహస్తి, మధ్యాహ్నం 12గంటలకు కాణిపాకం వినాయక దర్శనం, సాయంత్రం 6గంటలకు శ్రీపురం గోల్డెన్ టెంపుల్ మరియు ఆగష్టు 31వ తేదీ ఉదయం 5గంటలకు అరుణాచలం దర్శనం కొరకు చేరుకొని... తిరిగి సెప్టెంబర్ 1వ తేది ఉదయం 4గంటలకు వినుకొండ చేరుకొనును. కావున భక్తులు తీర్థయాత్ర అభిలాషకులు ఈ అవకా శాన్ని సదివినియోగించు కోవాలని, టిక్కెట్ ధర ఒక్కొక్కరికి రూ.2550 నిర్ణయించామని, ముందస్తుగా రిజర్వేషన్ సదుపాయం కలదని తెలిపారు. డిపో మేనేజర్ శ్రీ బి. కోటేశ్వరరావు నాయక్. వివరముల కొరకు 7382895527,7382898320 నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

అప్పారావుకు అభినందన సభ

విశాలాంధ్ర-వినుకొండ : స్థానిక తిరుమల నర్సింగ్ హోమ్ నందు ఆరోగ్య మిత్ర కాకాని అప్పారావుకు జిల్లా తరఫున అందిస్తున్న అత్యుత్తమ ప్రతిభ, సేవలను గుర్తించి ఆరోగ్యశ్రీ హెల్త్ కేర్ ట్రస్ట్ వారు ఆరోగ్య మిత్రాకు " సేవా ఆరోగ్య మిత్ర" ప్రశంసా పత్రం, మరియు ప్రోత్సాహక నగదు 5000 రూపాయలను సోమవారం జిల్లా కలెక్టర్ లోతేటి శివ శంకర్ చేతుల మీదుగా అవార్డు అందుకోవటం పట్ల పట్టణం లోని తిరుమల నర్సింగ్ హోమ్ మేనేజింగ్ పార్ట్నర్ కూరపాటి అప్పి రెడ్డి మరియు సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా హాస్పటల్లో ఏర్పాటు చేసిన అభినందన సభలో ఘనంగా దృశ్యాలువా పూలమాలతో సన్మానించారు. ఈ సందర్భంగా అప్పిరెడ్డి మాట్లాడుతూ నిజాయితీ పరుడు, సేవా తత్పరుడు ,సమయ స్ఫూర్తి కలిగిన ఆరోగ్య మిత్ర కాకాని అప్పారావు కు ఈ అవార్డు రావడం మాకెంతో సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో హాస్పిటల్ సిబ్బంది పాల్గొని అభినందనలు తెలిపారు.

చంద్రయాన్-3 విజయోత్సవ ర్యాలీ

విశాలాంధ్ర-వినుకొండ: చంద్రయాన్-1 విజయ వంతంపై జిల్లా పరిషత్ బాలికలు ఉన్నత పాఠశాల ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు విద్యార్థినీలు పట్టణ పురవీధుల నందు ర్యాలీ నిర్వహించారు. 140 కోట్ల భారతీయులు గర్వపడేలా అంతర్జాతీయ స్థాయిలో గర్వపడేలా భారతదేశ శాస్త్రవేత్తలు చిరస్మరనీయమైన విజయాన్ని అందుకున్నారని కొనియాడారు. ఇస్రో టీమ్‌కు అభినందనలు తెలుపుతూ జయ హెూ భారత్, జయహెూ ఇస్రో అనే నినాదాలు చేశారు. ఈ కార్యక్రమం పాఠశాల ప్రధానోపాధ్యాయిని కె. నాగ లక్ష్మి, ఉపాధ్యాయులు సిద్దిక్, చంద్రశేఖర్, పట్టాభి రామారావు, ధనకోటేశ్వరరావు, ఎం. రమాదేవి, ఆర్. నాసరమ్మ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి పోటీల్లో వెల్లలూరు విద్యార్థుల ప్రతిభ

విశాలాంధ్ర-పొన్నూరు : గిడుగు రామ్మూర్తి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని తెలుగు భాషా మాధుర్యం అంశంపై గుంటూరు ఉమెన్స్ కాలేజీలో గురువారం జరిగిన వకృత్వ, వ్యాసరచన జిల్లా స్థాయి కళాశాలల పోటీలలో వెల్లలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్లస్ టూ విద్యార్థినీలు తమ ప్రతిభను కనబరిచారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్లస్ టూ ఇంటర్ ఫస్టియర్ విద్యార్థిని తోట జగదీశ్వర ఉజ్వల ద్వితీయ స్థానంలో నిలిచి తమ ప్రతిభను కనబరిచారు. వీరిని అధ్యాపకులు ఎంఎం.ఖుద్దూస్, టి.అరుణ్ కుమార్, వి.రమేష్, బాబురావు, ఉపాధ్యాయులు కిషోర్ పద్మలత, గోకుల్ చంద్, పీడీ సరళ, సర్పంచ్ ఇక్కుర్తి మల్లికార్జున్ రావు, అభినందించారు.

సీపీఐ బస్సు యాత్ర జయప్రదం చేయండి

బైరాపట్నం రామకృష్ణ

విశాలాంధ్ర-క్రోసూరు : నరసరావుపేటకు ఈ నెల 27వ తేదీ ప్రవేశించే సీపీఐ బస్సు యాత్రను జయప్రదం చేయాలని ఆ పార్టీ పల్నాడు జిల్లా కార్యవర్గ సభ్యులు బైరాపట్నం రామకృష్ణ సీపీఐ శ్రేణులకు పిలుపునిచ్చారు. గురువారం మండల కేంద్రమైన క్రోసూరులో సీపీఐ బస్సు యాత్ర కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలపై సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ నేతృత్వంలో జరుగుతున్న ఈ బస్సు యాత్ర విశాఖపట్నంలో ఈ నెల 17న ప్రారంభమై సెప్టెంబరు 8న తిరుపతిలో జరిగే బహిరంగ సభతో ముగుస్తుందన్నారు. ఈలోగా రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలలో ఈ బస్సు యాత్ర విస్తృతంగా పర్యటిస్తుందని చెప్పారు. ఈ బస్సు యాత్ర 27న పల్నాడు జిల్లా నరసరావుపేటలో మధ్యాహ్నం 3 గంటలకు ప్రారంభమై అదే రోజు సాయంత్రం ఐదు గంటలకు వినుకొండలో గొప్ప బహిరంగ సభ జరుగుతుందని చెప్పారు. పల్నాడు జిల్లాలోని పార్టీ శ్రేణులు, ప్రజలు, కార్మికులు, ఆంధ్రప్రదేశ్ ప్రజా నాట్యమండలి కళాకారులు బస్సు యాత్ర, బహిరంగ సభ ముగింపు వరకు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ సీపీఐ కార్యదర్శి మునుగోటి శ్రీనివాసరావు, క్రోసూరు మండల సీపీఐ కార్యదర్శి పోతుగంటి నాగేశ్వరరావు, పట్టణ కార్యదర్శి యాదగిరి, నియోజకవర్గ ప్రజానాట్యమండలి అధ్యక్షులు బోళ్ల నరసింహారెడ్డి, ఉపాధ్యక్షులు పోతురాజు కృష్ణమూర్తి, శ్రీరామ్ రాజేశ్వరరావు, కమిటీ సభ్యులు మల్లికార్జునరావు, సిహెచ్ సాంబశివ, ఏఐవైఎఫ్ నాయకులు పోతుగంటి నాగరాజు, రైతు సంఘం నాయకులు కంచేటి పెద్దబ్బాయి తదితరులు పాల్గొన్నారు.

వినుకొండ బహిరంగ సభ జయప్రదం చేయండి : మేకపోతుల

విశాలాంధ్ర-మాచర్ల: రాష్ట్రాన్ని- రక్షించుకుందాం, దేశాన్ని కాపాడుకుందాం అనే నినాదంతో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ నేతృత్వంలో చేపట్టిన రాష్ట్రవ్యాప్త బస్సు యాత్రలో భాగంగా ఈనెల 27న వినుకొండలో నిర్వహించనున్న భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని సీపీఐ మాచర్ల ఏరియా కార్యదర్శి మేకపోతుల శ్రీనివాస్ రెడ్డి కోరారు. గురువారం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పాలనలో పేద మధ్య తరగతి కుటుంబాలకు జీవనం కష్టతరంగా మారిందన్నారు. ప్రజా సంక్షేమానికి కట్టుబడి పని చేయాల్సిన ప్రభుత్వాలు ఆదిశలో కనబడటం లేదన్నారు. పేద, మధ్యతరగతి, కార్మికుల సంక్షేమం కోసం పాటు బడాల్సిన ప్రధాని మోదీ కార్పొరేట్ శక్తులకు కొమ్ముకాస్తూ కార్మిక చట్ట సవరణలకు పాల్పడటం దుర్మార్గమన్నారు. దేశ వ్యాప్తంగా కొత్త పరిశ్రమలు ఏర్పాటు చేసి యువతకు ఉపాధి కల్పించాల్సిన ప్రభుత్వాలు, ఉన్న పరిశ్రమలను కార్పొరేట్లకు కట్టబెట్టి దారాదత్తం చేయడంలో అర్థం లేదన్నారు. కేంద్రంతో చీకటి ఒప్పందం కుదుర్చుకున్న సీఎం జగన్, మోడీ ఆదేశాలను తూచా తప్పకుండా పాటించడాన్ని రాష్ట్ర ప్రజలు గమనిస్తున్నారన్నారు. పాలక ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలను తిప్పి కొట్టేలా వినుకొండలో నిర్వహించనున్న భారీ బహిరంగ సభలకు కార్మికులు, ప్రజలు, ప్రజాసంఘాల నాయకులు భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలని ఆయన కోరారు.

మాదిగల మహాసభ విజయవంతం చేయాలి

విశాలాంధ్ర-వినుకొండ: షెడ్యూల్ కులాల వర్గీకరణకు ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంట్ సమావేశాల్లోనే ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పిం చాలని ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షులు డాక్టర్ ముస్నంగి నాగరాజు మాదిగ డిమాండ్ చేశారు. బుధవారం వినుకొండ నియోజకవర్గం లోని బార్ అసోసియేషన్ హాల్ నందు జరిగిన మాదిగల విశ్వరూప మహాసభ సన్నాహక సమావేశంలో భాగంగా ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. బిజెపి అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే వర్గీకరణ చేస్తామని చెప్పి 9 ఏళ్లు గడుస్తున్నప్పటికీ వర్గీకరణ అంశాన్ని పరిష్కరించడంలో మాదిగలను నమ్మించి మోసం చేసిన పార్టీగా బిజెపి నిలుస్తుంది అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో వర్గీకరణకు రాష్ట్ర అసెంబ్లీలో తీర్మానం ప్రవేశపెట్టి అఖిలపక్ష బృందాన్ని ఢిల్లీకి తీసుకు వెళ్లేందుకు కృషి చేయాలని డిమాండ్ చేశారు. మాదిగ ప్రజలను వర్గీకరణ విషయంలో మోసం చేసిన పార్టీలతో రాజకీయంగా తాడోపేడు తెలుసుకునేందుకు మాదిగల విశ్వరూప మహాసభను 20 లక్షల మంది ప్రజలతో హైదరాబాద్ కేంద్రంగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో గార్లపాటి రమేష్, కందుల దేవ, బక్కా ప్రకాష్, మాచర్ల కోటయ్య, కట్టెంపూడి ఇమ్మానియేల్ ,కోట లక్ష్మయ్య,చిలక షిండేయాకోబు, వినుకొండ నాగేశ్వరరావు, యేసు వేల్పుల, బాబురావు, వేల్పుల వెంకయ్య,తదితరులు పాల్గొన్నారు.

పేదలకు దుప్పట్లు పంపిణీ

విశాలాంధ్ర-మంగళగిరి : వైవీజే ట్రస్ట్ చైర్మన్ వై.జీవన్ ఆధ్వర్యంలో స్థానిక ఆత్మకూరు కాలువ ప్రక్కన నివసిస్తున్న వారికి దుప్పట్లు పంపిణీ చేయటం జరిగింది. ఈ కార్యక్రమంలో కె.రూఫస్, ఎం.జవహర్, ఎం.రాజారావు, వై.హనోక్, బి.సమూయేలు ముఖ్యఅతిధులుగా పాల్గొని పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఇలాంటి కార్యక్రమాలు మరిన్ని చేయాలని స్థానికులు ఆకాంక్షించారు.

జగనన్న ఇళ్లు త్వరితగతిన పూర్తి చేయాలి

విశాలాంధ్ర-అమరావతి : మండల పరిధిలో నిర్మాణంలో ఉన్న జగనన్న ఇల్లు త్వరితగతన పూర్తి చేయాలని అమరావతి మండల ప్రజా పరిషత్ అధికారిని పి.ఉమాదేవి ఆదేశాలు జారీ చేశారు. గురువారం మండల పరిధిలోని వివిధ ప్రాంతాలను సందర్శించి ఆ గ్రామాలలో ఉన్న మౌలిక సదుపాయాలపై ఆయా గ్రామ కార్యదర్శులు, వలంటరీలతో పాటు ఉన్నత అధికారులతో మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో ఉన్న డ్రైనేజీలు ఇళ్ల నిర్మాణాలు మౌలిక సదుపాయాలు రూపకల్పన చేయడంలో అలసత్వాన్ని ప్రదర్శించిన వారిపై చర్యలు చేపట్టేందుకు వెనుకాడబోమని అన్నారు. ఆయా కార్యక్రమాలలో ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులతో పాటు పంచాయతీ కార్యదర్శులు, వలంటరీలు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. లబ్దిదారుల సమస్యలు వెనువెంటనే పరిష్కరించేందుకు అధికారులు సంసిద్ధంగా ఉండాలని కోరారు.

డీటీఎఫ్ లక్ష్మారెడ్డి మరణం తీరని లోటు

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు, వామ పక్ష ఉద్యమకారుడు డీటీఎఫ్ లక్ష్మారెడ్డి మరణం ఉపాధ్యాయ, పౌర, ప్రజాస్వామిక ఉద్యమాలకు తీరని లోటు అని అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి ఆవేదన వ్యక్తంచేశారు. ఈ మేరకు గురువారం ఆయనకు నివాళులర్పించారు. అనంతరం శివరామిరెడ్డి మాట్లాడుతూ 5 దశాబ్దాల పాటు జరిగిన అభ్యుదయ, ప్రజా ఉద్యమాల్లో కీలక పాత్ర పోషించారని, తాను నమ్మిన సిద్ధాంతాల కోసం రాజీలేని పోరాటం కొనసాగించినట్లు చెప్పారు. ఎక్కడ ఏ ప్రజా సంఘం ఉద్యమించినా పాల్గొని సంఘీభావం తెలిపి ఆ ఉద్యమంలో చివరి వరకు నిలబడ్డ గొప్ప పీడిత జన బంధువు లక్ష్మారెడ్డి అని కొనియాడారు. ఉపాధ్యాయ ఉద్యమాల్లో చోటు చేసుకున్న అస్తవ్యస్థ విధానాలను ఖండించి ధైర్యంగా తానొక్కడైనా నిలబడి నిజాన్ని నిర్భయంగా చాటిచెప్పిన లక్ష్మారెడ్డి లాంటి నాయకులు చాలా అరుదుగా ఉంటారని పేర్కొన్నారు.

వ్యర్థాల సేకరణ ప్రణాళిబద్ధంగా జరగాలి

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: నగరంలో వ్యర్థాల సేకరణ ప్రణాళికాబద్ధంగా జరగాలని, పారిశుధ్య నిర్వహణపై ప్రజల నుండి అనేక ఫిర్యాదులు అందుతున్నాయని, నిర్లక్ష్యంగా ఉండే అధికారులు, సచివాలయ కార్యదర్శుల పై కఠిన చర్యలు తప్పవని నగర కమిషనర్ కీర్తి చేకూరి స్పష్టం చేశారు. గురువారం నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో ప్రజారోగ్య, ఇంజినీరింగ్, హౌసింగ్ అధికారులతో పారిశుధ్యం, ఈ-ఆటోల నిర్వహణ, వినియోగం, గడపగడపకు మన ప్రభుత్వం పనుల పురోగతి, జగనన్న లే అవుట్స్‌లో ఇళ్ళ నిర్మాణ పనులు తదితర అంశాలపై ప్రజారోగ్య, ఇంజినీరింగ్, హౌసింగ్ అధికారులు, కాంట్రాక్టర్స్, ఎమినిటి కార్యదర్శులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఇంటింటి చెత్త సేకరణకు ఈ-ఆటోలను కేటాయించినా కొన్ని ప్రాంతాల్లో పారిశుధ్య పనులు మెరుగ్గా జరగడం లేదన్నారు. ప్రధాన రోడ్ల వెంబడి వ్యర్థాల కుప్పలు ఉంటున్నాయన్నారు. ఈ-అటోలను కేవలం ఇంటింటి చెత్త సేకరణకు మాత్రమే వినియోగించాలని, సెకండరి కలెక్షన్‌కు వినియోగిస్తే సంబందిత శానిటేషన్ కార్యదర్శి, ఇన్స్పెక్టర్ లపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. జగనన్న లే అవుట్స్‌ల్లో ఇళ్ళ నిర్మాణ పనుల పై సమీక్షలో కమిషనర్ మాట్లాడుతూ ఇళ్ళ నిర్మాణ కాంట్రాక్టు పొందిన కాంట్రాక్టర్లు ఇచ్చిన టార్గెట్ మేరకు పనులు చేయడం లేదని, నోడల్, హౌసింగ్ అధికారులు మరింత భాధ్యతగా పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. సమావేశంలో ఎస్.ఈ. భాస్కర్, డిప్యూటీ కమిషనర్ డి.రవీంద్ర, హౌసింగ్ పి.డి. వేణు గోపాల్, ఈ.ఈ. శంకర్రావు, ఎం.హెచ్.ఓ. డాక్టర్ భాను ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

'అధికార అహంతో ప్రజలను మోసం చేశారు'

విశాలాంధ్ర-పొన్నూరు : అధికారం ఉందన్న అహంకారంతోనే ఎమ్మెల్యే కిలారి రోశయ్య సామాన్య ప్రజలను మోసం చేశారని, అబద్ధానికి మోసానికి మరో పేరు కిలారి వెంకట రోశయ్య అని టీడీపీ సీనియర్ నేత, పొన్నూరు మాజీ ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ అన్నారు. రోడ్డు విస్తరణ పనుల్లో నష్టపోయిన భవన యజమానులకు వెంటనే నష్టపరిహారం చెల్లించాలని టౌన్ ప్లానింగ్ అధికారులను ఆయన డిమాండ్ చేశారు. రోడ్డు విస్తరణ పనుల్లో నష్టపోయిన వారికి తాము అండగా ఉంటామని, పోరాటం సాగిస్తామని హామీ ఇచ్చారు. రోడ్డు విస్తరణ పనులు ఏ విధంగా జరుగుతున్నాయి అంటూ గురువారం మున్సిపల్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. రోడ్డు విస్తరణ పనులు చేపట్టేందుకు ఇచ్చిన ఆర్డర్ కాపీను చూపాలంటూ అధికారులను నిలదీశారు. మున్సిపల్ కమిషనర్ లేకపోవడంతో టీపీఓ సాంబయ్యను రోడ్డు విస్తరణ పనుల్లో నష్టపోయిన వారిని నష్టపరిహారం ఏ ప్రాతిపదికన చెల్లిస్తున్నారంటూ ఆయన నిలదీశారు. దానికి సరైన సమాధానం లేకపోవడంతో అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధితులకు న్యాయం జరిగేంత వరకు పోరాటం సాగిస్తానన్నారు. పట్టణంలో రోడ్డు విస్తరణ పేరుతో జరిగిన విధ్వంసంలో భాగస్వాములైన అధికారులు జైలుకుపోక తప్పదని హెచ్చరించారు. పట్టణంలో రోడ్డు విస్తరణకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు లేదా పురపాలక సంఘం కౌన్సిల్ తీర్మానాలు తదితర అంశాలకు సంబంధించిన వివరాలను తెలుసుకోవాలని గత రెండున్నర గంటలుగా ప్రయత్నిస్తున్నా ఈ కార్యాలయంలో సరియైన సమాధానం చెప్పే పరిస్థితి లేదని అన్నారు. రోడ్డు విస్తరణ పేరుతో భవనాలు కూల్చివేసి ఇప్పటికి 14 రోజులు అవుతున్నా పూర్తి స్థాయిలో బాధితులకు పరిహారం చెల్లించలేదని అన్నారు. పఠాన్ అహ్మద్ ఖాన్, బండ్లమూడి బాబురావు, పఠాన్ ఫిరోజ్ ఖాన్, ఎద్దు సోంబాబు, మాదల వెంకటేశ్వరరావు, బొర్రు రామారావు, బాజీ సాహెబ్, బందారు వంశీకృష్ణ, ఆకుల సాంబశివరావు, తానికొండ లక్ష్మీనారాయణ చౌదరి, పిన్నమనేని కోటేశ్వరరావు, అనిశెట్టి వీరబాబు, అలపర్తి చంద్రమోహన్, శిలార్ బాష పాల్గొన్నారు.

నేటి ఎస్ఐ దేహదారుడ్య పరీక్ష వాయిదా

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: పోలీసు పెరేడ్ గ్రౌండ్స్ మైదానంలో వర్షం కారణంగా ఈ నెల 25వ తేదీన గుంటూరు రేంజ్ పరిధిలో జరగవలసిన ఒక్క రోజు యస్.ఐ దేహదారుడ్య ఫిజికల్ టెస్ట్‌ను సెప్టెంబర్ 16వ తేదీకి వాయిదా వేసినట్టు గుంటూరు రేంజ్ ఐ.జి పాల్ రాజు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 26 తేదీ నుండి యదావిధిగా యస్ఐ అభ్యర్థులకు దేహదారుడ్య పరీక్షలు జరుగుతాయని తెలిపారు. అభ్యర్థులు గమనించాలని కోరారు.

ప్రభుత్వ భూములు స్వాధీనం చేసుకోండి

రెవెన్యూ అధికారులకు హైకోర్టు ఆదేశం

విశాలాంధ్ర-వినుకొండ రూరల్ : వివాదాస్పదంగా మారిన భూములను గూర్చి రాష్ట్ర సర్వోన్నత న్యాయస్థానం స్పష్టమైన ఆదేశాలు చేసింది. పల్నాడు జిల్లా వినుకొండ మండలం జాలలపాలెం గ్రామానికి చెందిన ప్రభుత్వ భూములను స్థానిక శాసనసభ్యులు బొల్లా బ్రహ్మనాయుడు కబ్జా చేశారంటూ కీర్తిపాటి వెంకటేశ్వర్లు అనే యువకుడు ఇటీవల హైకోర్టులో ప్రజాప్రయోజనాల వ్యాజ్యం వేశాడు. దీనిపై విచారణ చేపట్టిన న్యాయస్థానం ఈ మేరకు మంగళవారం స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. ప్రభుత్వానికి చెందిన భూములను తక్షణమే స్వాధీనం చేసుకోవాల్సిందిగా రెవెన్యూ అధికారులకు న్యాయమూర్తులు ఆదేశాలు జారీచేశారు. న్యాయమూర్తులు జస్టిస్ ఠాకూర్, జస్టిస్ శేషసాయిల ధర్మాసనం ముందు పిటిషనర్ తరపున ప్రముఖ న్యాయవాది జడ శ్రావణ్ కుమార్ వాదనలు వినిపించారు. 175 ఎకరాల విస్తీర్ణంతో కూడిన కోట్లాది రూపాయల విలువచేసే ప్రభుత్వ భూమిని వినుకొండ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడుకు చెందిన కంపెనీ శ్రీవత్సవ ఫుడ్ పార్క్ ప్రైవేట్ లిమిటెడ్, మూల్పూరి ఆగ్రో టెక్ కంపెనీలు ఆక్రమించాయని, సదరు భూములను ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు తనఖా పెట్టి రూ.50 కోట్ల రుణం కూడా పొందారని కనుక ప్రభుత్వ భూములను కబ్జాదారుల నుంచి కాపాడలని ఫిర్యాదు తరుపున న్యాయవాది జడ శ్రావణ్ కుమార్ వాదనలు వినిపించారు. దీంతో ఏకీభవించిన ధర్మాసనం ఈ మేరకు స్పందిస్తూ ఆక్రమణలపై విచారణ చేపట్టి తక్షణమే ప్రభుత్వం సదురు భూములను స్వాధీనం చేసుకోవాల్సిందిగా రెవెన్యూ అధికారులను ఆదేశించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శితో పాటు జిల్లా కలెక్టర్‌కు న్యాయస్థానం ఆదేశాలు జారీ చేసింది. ఈ ప్రక్రియ మూడు నెలల వ్యవధిలోపూర్తి చేయాలని ఆదేశాలలో న్యాయస్థానం పేర్కొంది. కబ్జాదారులకు వ్యతిరేకంగా రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం వెలువరించిన ఉత్తర్వులతో వినుకొండలో ప్రజల్లో, రాజకీయ నాయకుల్లో చర్చనీయాంశంగా మారింది. సదరు భూములపై ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు, మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు మధ్య గత కొంతకాలంగా విమర్శలు ప్రతి విమర్శలతో రాజకీయ వేడి రాజుకుంటుంది. ప్రస్తుతం న్యాయస్థానం ఉత్తర్వులతో వినుకొండ రాజకీయాలు మరింత హీట్ ఎక్కాయి. నిన్న మొన్నటి వరకు సదరు భూముల్లో ఒక సెంటు కూడా ప్రభుత్వంది లేదని ఉంటే నిరూపించాలని సవాలు విసిరిన శాసనసభ్యులు బొల్లా బ్రహ్మనాయుడు ప్రస్తుత హైకోర్టు ఉత్తర్వులతో కంగుతిన్నారు. అయితే దీనిపై స్పందించకుండా ఆయన తన ప్రత్యర్థి మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులుపై భూకబ్జా ఆరోపణలను తెర మీదకు తీసుకొస్తున్నారు. ప్రస్తుతం ఈ ఇద్దరు నాయకుల వ్యవహార శైలి వినుకొండ పట్టణంలో ప్రజలు సునీసితంగా పరిశీలిస్తున్నారు.

పిచికలపాలెంలో వరుస చోరీలు..

విశాలాంధ్ర-శావల్యాపురం : మండలంలోని పిచికలపాలెం గ్రామంలో ఇటీవల జరుగుతున్న వరుస దొంగతనాలతో ప్రజలలో తీవ్ర ఆందోళన నెలకొంది. 15 రోజుల క్రితం గ్రామానికి చెందిన పావళ్ళ నరసింహారావు పొలంలో ఏర్పాటు చేసిన విద్యుత్ మోటర్‌ను గుర్తు తెలియని వ్యక్తులు అపహరించగా, 10 రోజుల క్రితం గ్రామానికి చెందిన చిమటా నాగరాజు తన హీరో హోండా గ్లామర్ బైకును ఇంటి ముందు పార్క్ చేయగా గుర్తు తెలియని వ్యక్తులు అపహరించారు. విద్యుత్ మోటర్‌ను అపహరించిన దుండగులు వినుకొండలోని మెకానిక్ షెడ్లో విక్రయించేందుకు వెళ్ళగా మోటర్‌ను పరిశీలించిన మెకానిక్ గతంలో ఇదే మోటర్‌ను పిచికలపాలెం గ్రామస్తులకు తానే అమ్మినట్లుగా గుర్తించి అనుమానంతో వచ్చిన వ్యక్తిని ఆరా తీయడంతో అతడు చెప్పకుండా బైకుపై అక్కడి నుండి పరారయ్యారు. బైకుపై వెళుతున్న వ్యక్తిని, బైకు నెంబర్‌ను మెకానిక్ ఫోటోలు తీసి బాధితులకు పంపడంతో వారు స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. పోలీసులకు ఫిర్యాదు చేసిన సంగతి తెలుసుకొన్న దుండగులు రెండ్రోజుల క్రితం విద్యుత్ మోటర్‌ను దొంగిలించిన స్థానంలోనే పెట్టి వెళ్ళిపోయారు. బైక్ ఫోటోలు, బైక్ నెంబర్ కూడా తెలిసినా పోలీసులు ఇంతవరకు నిందితులను గుర్తించకపోవడంపై గ్రామస్తులలో అసంతృప్తి నెలకొంది. అంతేకాకుండా ఇటీవల కాలంలో గ్రామానికి చెందిన రైతులు పొలాల్లో ఏర్పాటు చేసిన పొగాకు బేళ్ళను, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లలో రాగితీగలను గుర్తు తెలియని వ్యక్తులు అపహరించారు. ఇలా వరుసగా చోరీలు జరుగుతుండడంతో గ్రామస్తులు భయాందోళనలకు గురవుతున్నారు. ఇప్పటికైనా పోలీసులు స్పందించి వరుస చోరీలకు పాల్పడుతున్న నిందితులను గుర్తించి భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా తగిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

అంగన్‌వాడీ కార్యకర్తలకు యూనిఫాం పంపిణీ

విశాలాంధ్ర-పెదకూరపాడు : మండల పరిధిలోని 75 తాళ్లూరు ఐసీడీఎస్ ప్రాజెక్టులో పనిచేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలకు పల్నాడు జిల్లా కలెక్టర్ శివశంకర్ యూనిఫాం పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో అంగన్‌వాడీ కార్యకర్తలు ఎప్పటికప్పుడు సర్వే నిర్వహించి రికార్డులు సక్రమంగా ఉంచుకోవాలని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన పోషకాహారాన్ని ప్రతి చిన్నారి, గర్భిణీలు, బాలింతలకు అదేవిధంగా కృషి చేయాలని అన్నారు. ప్రతి విషయాన్ని యాప్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకుని సక్రమంగా పనిచేయాలని సూచనలు, సలహాలు ఇచ్చారు. అనంతరం ఐసీడీసీ కార్యాలయాన్ని సందర్శించి పనితీరును చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సీడీపీఓ స్వర్ణ కుమారి, ఎంఈఓ ఏకుల ప్రసాదు, సత్యనారాయణ, ఎంపీడీవో నరసింహారావు, తహశీల్థార్ క్షమారాణి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ మున్నీ శ్రీదేవి, కంప్యూటర్ ఆపరేటర్ వెంకటేశ్వరరావు నాయక్, అంగన్‌వాడీ కార్యకర్తలు రమాదేవి, నరసమ్మ, శివకుమారి, వజ్రమ్మ, విజయ, కమిటీ చైర్మన్ గుత్తికొండ శ్రీనివాసరెడ్డి, ఎత్తిపోతల పథకం చైర్మన్ బి.హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

వేడుకల్లో ఎమ్మెల్యే

విశాలాంధ్ర-అమరావతి : మండలంలోని వైకుంఠపురం గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు నందూరి శ్రీనివాసరావు కుమారుడు హరికృష్ణ, శిరీషల వివాహ మహోత్సవానికి హాజరై నూతన వధూవరులను పెదకూరపాడు శాసనసభ్యులు నంబూరు శంకరరావు ఆశీర్వదించారు. అనంతరం అమరావతి మండలం అమరావతి గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు వాడపర్తి పుల్లారావు నూతన గృహప్రవేశం మహోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఆయా కార్యక్రమాలలో పలువురు పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ మద్యం పట్టివేత

విశాలాంధ్ర-పిడుగురాళ్ళ : అడిషనల్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ (ఎస్ఈబీ)వారి ఆదేశాల మేరకు గురువారం పిడుగురాళ్ల ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్, వారి సిబ్బందితో కలిసి వారికి రాబడిన ముందస్తు సమాచారం మేరకు మాచవరం మండలం వెల్లంపల్లి పుష్కర్ ఘాట్ వద్ద నిఘా ఏర్పాటు చేయగా ఇద్దరు వ్యక్తులు ఇంజన్ బోట్ నుంచి మద్యం గోతాలు దింపుతుండగా వారి ఇరువురును అదుపులో తీసుకున్నారు. దీంతో సదరు బోటును పరిశీలించగా అందులో మొత్తం 411 తెలంగాణ మద్యం సీసాలు, 180 ఎంఎల్, 30 తెలంగాణ మద్యం సీసాలు 750 ఎంఎల్, 48 తెలంగాణ బీర్ బాటిల్స్ కనుగొన్నారు. అనంతరం ఇద్దరు వ్యక్తులను తెలంగాణ మద్యం గురించి విచారించగా వారు తెలంగాణలోని వైన్‌షాపుల నుంచి కొనుగోలు చేసి మాచవరంలోని వివిధ గ్రామాలలో అమ్ముతుంటామని తెలపడం జరిగిందని ఇన్‌స్పెక్టర్ తెలిపారు. పి.హనుమంతు నాయక్, ఎ.వెంకటేశ్వర్లను చెన్నైపాలెం గ్రామవాసులును అరెస్ట్ చేసి తెలంగాణ మద్యంను, ఇంజన్ బోటును, రూ.80వేలు సీజ్ చేశారు.

ఐటీఐల్లో మూడో విడత అడ్మిషన్లకు ఆహ్వానం

విశాలాంధ్ర-మాచర్ల : ప్రభుత్వ ప్రైవేటు ఐటిఐలలో 2023-24వ సంవత్సరానికి గాను 3వ విడత అడ్మిషన్లకు దరఖాస్తులు కోరనున్నట్లు పల్నాడు జిల్లా కన్వీనర్ ఆర్‌ఐటిఐ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్‌ఎస్‌వీ ప్రసాద్‌బాబు కోరారు. గురువారం ప్రిన్సిపాల్ ప్రసాద్ బాబు మాట్లాడుతూ ఆసక్తి గల అభ్యర్థులు అన్ని ధృవపత్రాలతో ఐటీఐ. ఏపీ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్ ద్వారా ఈ నెల 27వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు లోపు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందన్నారు. మాచర్ల ప్రభుత్వ ఐటిఐలో డీజిల్ మెకానిక్, వెల్డర్ సీట్లు మాత్రమే ఖాళీలు ఉన్నాయన్నారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఈ నెల 28న తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో కళాశాలలో ధృవీకరించుకోవాలని, 30, 31వ తేదీలలో కౌన్సిలింగ్ నిర్వహించటం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు.

ఏడుగురు పేకాట రాయుళ్ల అరెస్ట్

విశాలాంధ్ర-శావల్యాపురం : పేకాట శిబిరంపై దాడి చేసి ఏడుగురు అరెస్టు చేసిన ఈ ఘటన మండలంలోని వైకల్లు గ్రామంలో గురువారం సాయంత్రం చోటుచేసుకుంది. ఎస్సై తిరుపతిరావు తెలిపిన వివరాల ప్రకారం వైకల్లు గ్రామంలో పేకాట నిర్వహిస్తున్నట్లు సమాచారం అందడంతో గ్రామంలో దాడి చేయగా ఏడుగురుని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.38,180లను స్వాధీనం చేసుకుని, ఏడుగురిపై కేసు నమోదు చేశామని తెలిపారు. ఆయన వెంట కానిస్టేబుల్స్ ఉన్నారు.

సెయింట్ ఆన్స్‌లో చంద్రయాన్-3 సంబరాలు

విశాలాంధ్ర-పెదకూరపాడు : చంద్రయాన్-3 విజయవంతం కావడం పట్ల స్థానిక సెయింట్ ఆన్స్ పాఠశాలలో సంబరాలు జరిగాయి. విక్రమ్ లాండేర్ విజయవంతముగా జాబిల్లిపై దిగిన విధానాన్ని విద్యార్థులకు కళ్ళకు కట్టినట్లు వివరించి విజయపతాకాలతో ఊరేగించి, జయహో ఇస్రో-జయహో చంద్రయాన్-3 అంటూ నినాదాలు చేస్తూ ఉపన్యాసాలు ఇచ్చారు. విద్యార్థులు ఇస్రో శాస్త్రవేత్త చైర్మన్ సోమనాథ్ గురించి చేసిన కృషిని గురించి, భారత చరిత్రలో జాబిల్లి యాత్రలో ఏ దేశము అందుకోలేని సంక్లిష్ట లక్ష్యాన్ని ఇస్రో విజయవంతం చేసినందుకు, విజయ గర్వంతో విద్యార్థులు జయనాదాలు చేశారు.

మార్గదర్శి విద్యార్థుల మానవహారం

విశాలాంధ్ర-తాడికొండ : చంద్రునిపై కాలు మోపిన చంద్రయాన్-3 ప్రయోగ విజయాన్ని కాంక్షిస్తూ తాడికొండ మార్గదర్శి స్కూల్ విద్యార్థులు గురువారం స్థానిక అడ్డరోడ్డు సెంటర్‌లో మానవహారం నిర్వహించారు. స్కూలు నుంచి అడ్డరోడ్డు వరకు ర్యాలీగా వెళ్లారు. ఈ సందర్భంగా రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ మందపాటి శేషగిరిరావు మాట్లాడారు. ఇస్రో ప్రయోగాలతో ప్రపంచం భారతదేశం వైపు చూసే పరిస్థితి వచ్చిందన్నారు. మరిన్ని ప్రయోగాలతో ఇస్రో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ గోపి, దేశి శ్రీనివాసరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

పోసాని ఆరోపణలు ఖండించిన టీడీపీ

విశాలాంధ్ర-పెదకాకాని : తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు చంద్రబాబు, ప్రధాన కార్యదర్శి లోకేష్‌లపై వైసీపీ నాయకులు పోసాని కృష్ణమురళి చేసిన ఆరోపణలను మండల టీడీపీ నాయకులు ఖండించారు. పెదకాకానిలోని మండల టీడీపీ కార్యాలయంలో గురువారం సాయంత్రం ఏర్పాటు చేసిన పత్రిక విలేకరుల సమావేశంలో టీడీపీ నాయకులు మాట్లాడారు. తెలుగు జాతి ఆత్మగౌరవాన్ని పెంపొందించింది నారా చంద్రబాబు నాయుడు అని అన్నారు. నారా లోకేష్ ఇంకా చట్టాన్ని గౌరవిస్తున్నారు కాబట్టే న్యాయం కోసం కోర్టు మెట్లు ఎక్కారని అన్నారు. నారా లోకేష్ యువగళం పాదయాత్ర ద్వారా జనంలో అశేష ప్రజాదరణతో పొందుతున్నారని భావించి ఇటువంటి చోట నాయకులు ద్వారా లోకేష్‌పై బురదచల్లుతున్నారని అన్నారు. ఈ సమావేశంలో మండల పార్టీ అధ్యక్షులు వలివేటి మురళీకృష్ణ, రాష్ట్ర మైనారిటీ అధికార ప్రతినిధి షేక్ మహ్మద్ మోసిన్, రాష్ట్ర మహిళ కార్యదర్శి మల్లినేని రుక్మిణి, పెదకాకాని గ్రామ పార్టీ అధ్యక్షులు కుక్కల మల్లిఖార్జునరావు, ప్రధాన కార్యదర్శి బోయపాటి రామ్‌మోహన్ రావు, మండల పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షులు కూచిపూడి రాజేష్, ఉప్పాలపాడు గ్రామ ఉపసర్పంచ్ దుద్దికూరి భూశిబాబు, పార్టీ జిల్లా మైనారిటీ అధికార ప్రతినిధి షేక్ అల్లావుద్దీన్, నియోజకవర్గ ఎస్సీ సెల్ అధికార ప్రతినిధి ఆత్మకూరి వెంకటేశ్వర్లు, షేక్ అజీజ్ తదితరులు పాల్గొన్నారు.

చంద్రయాన్-3 విజయోత్సవ ర్యాలీ

విశాలాంధ్ర-పర్చూరు: ఇస్రో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన చంద్రయాన్-3 విజయవంతం అయిన సందర్భంగా గురువారం పర్చూరు ఆక్స్‌ఫర్డ్ హైస్కూల్ విద్యార్థులతో ప్రధాన వీధులలో జాతీయ జెండాతో భారీ ర్యాలీ నిర్వహించారు. దేశ ప్రతిష్టతను చాటుతూ సాగిన ర్యాలీ విశేషంగా ఆకుట్టుకుంది. విద్యార్థులు చేసిన జయహో భారత్ నినాదాలు ఆకట్టుకున్నాయి. ర్యాలీ సజావుగా సాగేలా ఉపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయులు చర్యలు తీసుకున్నారు. విజయోత్సవ ర్యాలీలో స్కూల్ చైర్మన్ గోరంట్ల సుబ్బారావు, డైరెక్టర్ నాదెండ్ల లక్ష్మయ్య చౌదరి, అకడమిక్ డైరెక్టర్ సుబ్బరామరెడ్డి, ప్రిన్సిపాల్ పఠాన్ షాఫియా, ఉపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు ఉన్నారు.

ఇస్రో శాస్త్రవేత్తల అవిరళ కృషి

విశాలాంధ్ర-అద్దంకి ; చంద్రయాన్-3 విజయవంతం కావడానికి భారత శాస్త్రవేత్తలు అవిరళ కృషి చేశారని రోటరీ క్లబ్ ఆఫ్ సింగరకొండ అధ్యక్షులు చిన్ని మురళీకృష్ణ అన్నారు.చంద్రయాన్3 ప్రయోగం విజయవంతం అయిన సందర్భముగా గురువారం రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక రోటరీ కార్యాలయంలో గురువారం అభినందన కార్యక్రమం జరిగింది.ఈసందర్భముగా వక్తలు మాట్లాడుతూ చంద్రయాన్-3 పరిశోధనల వలన మన దేశం సాంకేతికంగా పురోగమిస్తుందని,అందుకు శాస్త్రవేత్తల బృందానికి జేజేలు పలికి,భారత ప్రభుత్వానికి అభినందనలు తెలిపి మిఠాయిలు పంచారు.కార్యక్రమంలో రోటరీ కార్యదర్శి చప్పిడి వీరయ్య.రోటరీ సభ్యులు దేవపాలన,పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి,కొల్లా భువనేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వ్యర్థాలతో అద్భుతాలు

విశాలాంధ్ర-అద్దంకి ; ప్లాస్టిక్ వ్యర్థాలతో అద్భుతాలు సృష్టించవచ్చని స్థానిక కెఆర్‌కె డిగ్రీ కళాశాల విద్యార్థులు నిరూపించారు. పర్యావరణానికి హానికలిగించే ప్లాస్టిక్ బాటిళ్ళను సేకరించి వాటిని పూల కుండీలుగా మార్చి వాటిలో పర్యావరణ హిత మందు మొక్కలను పెంచి కళాశాలలో నిర్వహించే వివిధ కార్యక్రమాలలో పాల్గొనే అతిథులను సత్కరించే ఉన్నత కార్యక్రమానికి విద్యార్థులు శ్రీకారం చుట్టారు. వృక్షశాస్త్ర విభాగ కృషిని కళాశాల ప్రిన్సిపాల్ మోహనరావు,అధ్యాపకులు అభినందించారు.

అనారోగ్యంతో ఉపాధ్యాయుడి మృతి

విశాలాంధ్ర - నిజాంపట్నం : మండలంలోని కొత్త పాలెం గ్రామంలోని నక్షత్రనగర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయునిగా పనిచేస్తున్న కొక్కిలిగడ్డ వెంకటేశ్వరరావు (48) అనారోగ్యంతో గురువారం మృతి చెందారు. ఈయన నిజాంపట్నం మండలంలోని వివిధ పాఠశాలల్లో ఎన్నో సంవత్సరా లుగా ఉపాధ్యాయునిగా పని చేస్తూ అందరితో కలి విడిగా ఉండేవారు. గత కొంత కాలంగా అనారో గ్యంతో చికిత్స పొందుతున్న అయన ఇటీవల లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ ఆపరేషన్ చేయించుకున్నారు.మృతునికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.భార్య ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్నారు.ఉపాధ్యాయుడు వెంకటేశ్వరరావు మృతి పట్ల ఎంఈఓ-2 శేషు గోపాలం, మండలంలోని ఉపాధ్యాయ సంఘాలు, ఉపాధ్యాయులు సంతాపం వ్యక్తం చేశారు.మృతుని కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

విశాలాంధ్ర - చీరాలరూరల్ : చీరాల నియోజక వర్గంలో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చేలా పార్టీ బలోపేతానికి కృషి చేయాలని చీరాల నియోజకవర్గ తెదేపా పరిశీలకులు నాతాని ఉమామహేశ్వర రావు అన్నారు. స్థానిక తెదేపా కార్యాలయంలో తనను కలిసిన నాయకులతో మాట్లాడుతూ నియోజకవర్గంలో పార్టీ జండా ఎగిరేలా సరైన ప్రణాళికతో ముందుకు సాగాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెదేపా రాష్ట్ర మైనారిటీ నాయకులు యాసిన్ చీరాల మండలం బీసీ సెల్ అధ్యక్షులు అంగిరేకుల వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి కోసూరి శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులు ధోని కనకరాజు, పోస హరిబాబు, తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ల ఇంటింటి సర్వే పూర్తి

విశాలాంధ్ర - చీరాల : నియోజకవర్గంలో బీఎల్‌ఓలు సాగించిన ఓటర్ల ఇంటింటి సర్వే పూర్తి అయ్యిందని చీరాల ఆర్‌డీఓ సరోజినీ తెలిపారు. గురువారం ఆర్డీఓ కార్యాలయంలోని తన ఛాంబర్ లో అధికారులు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ బిఎల్‌ఓలతో పాటు సర్వేలో పాల్గొన్న రాజకీయ పార్టీల ప్రతినిధులు దొంగ ఓట్లను గుర్తిస్తే ఆ సమాచారాన్ని అధికారులకు అందించాలన్నారు. రాజకీయ పార్టీల నాయకులు గుర్తించిన దొంగ ఓట్లు,జీరో డోర్ నంబర్లలో ఉన్న ఓట్ల వివరాలు తెలియపరిస్తే వాటిపై తదుపరి చర్యలు తీసుకుంటామని తెలిపారు.ఈ కార్యక్రమంలో అధికారులు వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

వివాహ వేడుకలో చైతన్య

విశాలాంధ్ర - బల్లికురవ : మండల పరిధిలోని గుంటుపల్లి గ్రామంలో గురువారం పరిటాల వారి వివాహ వేడుకల్లో శాప్ నెట్ చైర్మన్ అద్దంకి నియోజకవర్గ వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బాచిన కృష్ణ చైతన్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతన వధువు నాగలక్ష్మి నీ ఆశీర్వదించి వివాహ మహోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.ఈయన వెంట జిల్లా రైతు అధ్యక్షులు సంతమాగులూరు మార్కెట్‌యార్డ్ వైస్ చైర్మన్ చింతల పేరయ్య,బల్లికురవ సొసైటీ అధ్యక్షులు గుర్రం రంగారావు, నక్కబొక్కలపాడు గ్రామ సర్పంచ్ దూళిపాళ్ల బుల్లి రామయ్య,మండల కో ఆప్షన్ సభ్యులు షేక్ శ్రీనువలి,దివ్య రామాంజనేయులు తదితరులు ఉన్నారు.

జిల్లాలో పథకాల ద్వారా రూ.10.18 కోట్లు జమ

విశాలాంధ్ర - బాపట్ల : నవరత్నాల కింద జిల్లాలో 9,008 మందికి సంక్షేమ పథకాలు మంజూరయ్యాయని ముఖ్యమంత్రి దృష్టికి కలెక్టరు పి.రంజిత్ బాషా తీసుకెళ్లారు. లబ్ధిదారులకు రూ.10.18 కోట్ల నగదు మంజూరయ్యిందన్నారు. నవరత్నాలలో అర్హులై ఉండి ఏకారణం చేతనైనా సంక్షేమ పథకాలు అందని వారికి నగదు మంజూరు చేసే కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయం నుంచి ఆయన వర్చువల్ విధానంలో గురువారం ప్రారంభించారు. జిల్లా నుంచి జిల్లా కలెక్టరు పి.రంజిత్ బాషా, మహిళా లబ్ధిదారురాలైన నాగరాజ పాల్గొని రాష్ట్ర ముఖ్యమంత్రితో మాట్లాడారు. రాజ్యసభ సభ్యులు, జిల్లా కలెక్టర్, గుంటూరు జెడ్పీ చైర్ పర్సన్, శాసన మండలి సభ్యులు, శాసనసభ సభ్యులు చేతుల మీదుగా లబ్ధిదారులకు నగదును చెక్కు రూపంలో పంపిణీ చేశారు. జగనన్న సురక్ష కార్యక్రమాలు గత నెలలో బాపట్లలో బాగా జరిగాయని రాష్ట్ర ముఖ్యమంత్రికి కలెక్టరు వివరించారు. ఇంటింటికి మంచి జరగాలి, నవరత్నాలతో అర్హులందరికీ సంక్షేమ పథకాలు చేరవేస్తున్నామని రాష్ట్ర ముఖ్యమంత్రి వై.యస్.జగన్ మోహన్ రెడ్డి తెలిపారు. జిల్లాలోని ప్రజాప్రతినిధులు, అధికారులు జవాబుదారితనంతో బాగా పనిచేశారని తెలిపారు. 475 సచివాలయాలలో 4.76 లక్షల మందికి ధృవీకరణపత్రాలను ఉచితంగా పంపిణీ చేశామన్నారు. సగటున ఒక సచివాలయానికి ఒక వెయ్యి చొప్పున ప్రజలకు ధ్రువీకరణ పత్రాలు అందించామన్నారు. ఆ సమయంలో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి అర్హులను గుర్తించే క్రమంలో వారి నుంచి ధృవీకరణ పత్రాలు, దరఖాస్తులను తీసుకున్నామన్నారు. అలా తీసుకున్న దరఖాస్తుదారులందరికి ఇప్పుడు సంక్షేమ పథకాలు మంజూరయ్యాయన్నారు. బాపట్లలో వేలాదిమంది లబ్ధిపొందారని సి.ఎంకు వివరించారు.

జగనన్న చేదోడు ఆదుకుంది..
నాగరాజు, తిమ్మాయపాలెం అద్దంకి మండలం

ఒకప్పుడు కుట్టుమిషన్ పనితోనే నా ఇళ్ళు గడిచే పరిస్థితిలో ఉంది. జగనన్న చేదోడు పథకం నన్ను, నాకుటుంబాన్ని ఎంతగానో ఆదుకుంది. నాకు ఇద్దరు పిల్లలు ఉండగా 8వ తరగతి ఒకరు, మరొకరు ఒకటొవ తరగతి చదువు తున్నారు. ఇంగ్లీష్ మీడియం చదివించలేనని ఎంతో బాధ పడేదాన్ని. నాడు-నేడు పాఠశాలల అభివృద్ధితో ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లీష్ మీడియం ప్రవేశ పెట్టడం వల్ల ఇప్పుడు ప్రభుత్వ పాఠశాలలో ధైర్యంగా చేర్పించానని ఆమె చెప్పారు. ఆంగ్ల మాధ్యమంలో చదివిస్తానని నాకలలోనైనా ఊహించలేదని భావోద్వేగంతో మాట్లాడారు. 50 సెంట్ల భూమి సాగు చేసుకోవడానికి రూ.13,500లు పెట్టుబడినిధి ఇవ్వడంతో పంటలు పండించుకుంటున్నానని తెలిపారు. దివ్యాంగురాలినైన నేను ఎన్నో పర్యాయాలు దరఖాస్తులు చేసుకున్నప్పటికీ నాకు ధ్రువీకరణ పత్రం ఇవ్వలేదని, ఇటీవలే ధృవీకరణపత్రము ఇచ్చి పింఛను మంజూరు చేయడం ఎంతో సంతోషాన్ని ఇచ్చిందన్నారు. సీఎం సర్, దేవుడు ఇచ్చిన

అన్నగా భావిస్తున్నానని ఆమె చెప్పారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకటరమణ, జెడ్.పి చైర పర్సన్ హెన్నీ క్రిస్టినా, శాసనమండలి సభ్యురాలు పోతుల సునీత, చీరాల శాసనసభ్యులు కరణం బలరామకృష్ణమూర్తి, డి.ఆర్.డి.ఏ పి.డి బి. అర్జున్ రావు, డి.ఎల్.డి.ఓలు రాజేష్, సువార్త, డి.ఆర్.డి.ఏ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజల సౌకర్యార్థం రక్షక్ వన భోజనశాల: ఎస్పీ

విశాలాంధ్ర - బాపట్ల : పోలీస్ ప్రధాన కార్యాలయ అవరణలో సుందరమైన వాతావర ణంలో ప్రకృతి రమణీయతతో ఉన్న పచ్చని చెట్ల మధ్య ఆహ్లాదకరంగా వుండే విధంగా నిర్మించిన రక్షక్ వన భోజన శాల (వెల్ఫేయిర్ క్యాంటీన్)ను ఎస్పీ వకుల్ జిందాల్ గురువారం ప్రారంభించారు. అధికారులతో కలిసి భోజనశాల శిలాఫల కాన్ని ఆవిష్కరించి రిబ్బన్ కట్ చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ ప్రధాన కార్యాలయానికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి ప్రజలు, పోలీస్ సిబ్బంది ఉద్యోగ అవసరాల నిమిత్తం, వ్యక్తిగత పనుల మీద ఎక్కువ సంఖ్యలో వస్తుంటారన్నా రని అల్పాహారం, భోజనాలు లభించే క్యాంటీన్ లేక పోవడంతో పట్టణంలోకి వెళ్లాల్సి ఉండటంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారన్నారు. ముఖ్యంగా వృద్ధులు, మహి ళలు చాలా ఇబ్బందులు పడుతున్నారన్నారు. వారి సౌకర్యార్థం రుచికరమైన అల్పాహారం, భోజనం తక్కువ ధరకు

అందించేందుకు జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయ ప్రాంగణంలో జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో రక్షక్ వన భోజనశాల ప్రారంభించడం జరిగిందన్నారు. పూర్తిగా పోలీస్ వెల్ఫేయిర్ క్రింద నడపబడుతుందన్నారు. రక్షక్ వన భోజనశాలను ప్రారంభించడం పట్ల పోలీస్ సిబ్బంది ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు. ఇక నుంచి తాము అల్పాహారం, భోజనం కోసం కిలోమీటర్ల మేర పట్టణంలోకి వెళ్లే బాధ తప్పుతుందని తెలియజేశారు. అనంతరం సిబ్బందికి ఎస్పీ స్వయంగా అల్పాహారం వడ్డించారు. ఈ అడిషనల్ ఎస్పీ పి.మహేష్, ఏ.ఓ ఎమ్.ఎఫ్.రహమాన్, ఏ.ఆర్‌డి.ఎస్.పి ఎం.డి.హెచ్ ప్రేమ్ కుమార్, బాపట్ల, చీరాల, రేపల్లె డీఎస్పీలు టి. వెంకటేశ్వర్లు, ఎస్. ప్రసాద్‌రావు, టి.మురళీకృష్ణ, ఎస్సీ - ఎస్టీ సెల్ డిఎస్పి ఏ.వి రమణ, డి.ఎస్.బి సీఐ ఎ. శ్రీనివాస్, డిసిఆర్బి సీఐ పి. బాలమురళీకృష్ణ, వెల్ఫేర్ ఆర్.ఐ బి. శ్రీకాంత్ నాయక్, అడ్మిన్ ఆర్.ఐ ఎల్.మన్మధ రావు డిపిఓ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజామోదం పొందిన విగ్రహాన్ని ఏర్పాటు చేయాలి

విశాలాంధ్ర - చీరాలరూరల్ : పట్టణంలోని ముక్కోణం పార్క్ సెంటర్ నూతన అంబేద్కర్ సర్కిల్‌లో చేపడుతున్న అంబేద్కర్ కాంస్య విగ్రహం నిర్మాణంలో అంబేద్కర్ అభిమానులు అందరినీ కలుపుకుని పోవాలని నాయకులు అన్నారు. విగ్రహ నిర్మాణ స్థలం వద్ద మునిసిపల్ కమిషనర్ చర్యలకు నిరసనగా ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అంబేద్కర్ ఒక కులానికో, మతానికో చెందిన వ్యక్తి కాదని, ఆయన దేశ ప్రజల అందరివాడు అని తెలిపారు. విగ్రహం పార్లమెంట్ నమూనాను ప్రతిబింబించేలా ఉండాలని కోరారు. అంబేద్కర్ విగ్రహ నిర్మాణ కమిటీని ఏర్పాటు చేసి వారి యొక్క సలహాలు సూచనలు పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు. ప్రజా సంఘాలతో, దళిత నాయకులతో శనివారం స్థానిక ఎన్‌జీఓ హోమ్‌లో ఈ విషయమై సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో శీలం రవి, బత్తుల శామ్యూల్, తన్నీరు విజయ్, పూటుకూరి వెంకటేశ్వర్లు, గూడూరి శివరామ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

చంద్రయాన్-3 విజయవంతంపై హర్షం

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : చంద్రయాన్ 3 విజయవంతంగా చంద్రుని దక్షిణ ధృవం పైకి చేరుకోవటం భారతీయులకు అందరికి గర్వకారణమని మాజీ సైనిక సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు తాండ్ర సాంబశివరావు తెలిపారు. ఈ సందందర్భంగా సాంబశివరావు మాట్లాడుతూ చంద్రయాన్ 3 విజయోత్సవ సంబరాలు జరుపుకొని మిఠాయిలు పంచిపెట్టి, చంద్రయాన్ 3 విజయవంతానికి కృషి చేసిన శాస్త్రవేత్తలకు శుభాకాంక్షలు తెలిపారు. 2019లో చేసిన చంద్రయాన్ 2 ప్రయోగం విఫలం అయినప్పటికీ మన శాస్త్రవేత్తలు పట్టు వదలకుండా ప్రపంచ చరిత్రలోనే తిరుగులేని విధంగా చంద్రయాన్-3 తో విజయవంతమవటం భారతీయుల గొప్పతనానికి, ఐక్యతకు నిదర్శనం అన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సెక్రెటరీ తోట దుర్గా రావు, సీనియర్ మాజీ సైనికులు సుంకర శేషగిరి రావు, కృష్ణా రావు, ఆంజనేయులు, పసుపులేటి ప్రసాద్, చంద్ర మోహన్, రాయపుడి శ్రీనివాసరావు మొదలగు మాజీ సైనికులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

విశాలాంధ్ర-బాపట్ల టౌన్ : రోడ్డు దాటుతుండగా ఆర్టీసీ బస్సు ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన బాపట్ల కొత్త బస్టాండ్ వద్ద చీలు రోడ్ సెంటర్లో గురువారం చోటుచేసుకుంది.పట్టణ ఎస్సై మహమ్మద్ రఫీ తెలిపిన వివరాల ప్రకారం బీహార్ రాష్ట్రం పాట్నాకు చెందిన అభుజేష్ మంజేష్(42) బీహార్ కు చెందిన కార్మికులు ఇక్కడ పనిచేస్తున్నారు వారిలో ఒకరైన మంజేష్ బాపట్ల చీలు రోడ్డు సెంటరుకు వ్యక్తిగత పనుల కోసం వెళ్ళాడు. ఈ క్రమంలో రోడ్డు దాటుతుండగా ఆర్టీసీ బస్సు ఢీకొని అక్కడే మృతి చెందాడు మృతదేహాన్ని పోస్ట్ మార్టం నిమిత్తం బాపట్ల ఏరియా వైద్యశాలకు తరలించి జరిగిన ప్రమాదం పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రఫీ తెలిపారు.

క్రమం తప్పకుండా సంక్షేమ పథకాలు

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి సంక్షేమ క్యాలెండర్ రూపొందించి క్రమం తప్పకుండా వివిధ సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు అందజేస్తున్నారని కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం ముఖ్యమంత్రి తాడేపల్లిలోని ముఖ్యమంత్రి క్యాంప్ కార్యాలయం నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వివిధ సంక్షేమ పథకాలకు సంబంధించి ఏ కారణం చేతైనా లబ్ధిఅందని లబ్ధిదారుల ఖాతాల్లో బటన్ నొక్కి నగదు జమ చేయడం జరిగింది. గుంటూరు కలక్టరేట్ లోని వీసీ సమావేశ మందిరం నుండి కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డి, ఎమ్మెల్సీ అప్పిరెడ్డి, మేయర్ కావటి శివనాగ మనోహర్ నాయుడు, శాసన సభ్యులు మద్దాలి గిరిధర రావు, కిలారి వెంకట రోశయ్య, తదితరులు పాల్గొన్నారు.

కార్యక్రమం అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ అర్హత వుండి ఏ ఒక్క సంక్షేమ పథకం లబ్ది అందకుండా వుంటే వారికి న్యాయం చేయడానికి మరో అవకాశం కల్పిస్తూ డిసెంబర్, 2022 నుండి జూలై, 2023 వరకు అమలైన వివిధ సంక్షేమ పథకాలకు సంబంధించి ద్వైవార్షిక నగదు మంజూరు ద్వారా వారి ఖాతాల్లో డీబీటీ ద్వారా జమ చేయడం జరుగుతుందన్నారు. 10,548 మంది లబ్దిదారులకు సంబంధించిన రూ.11,50,26,896ల చెక్కును అందించడం జరిగింది.

కళాశాల విద్యార్థినుల ర్యాలీ

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : చంద్రయాన్-3 విజయవంతమైన సందర్భంగా బాపట్ల ఉమెన్స్ ఇంజనీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థునీలు గురువారం ర్యాలీ నిర్వహించారు. ప్రిన్సిపల్ డాక్టర్ జి. శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కళాశాల విద్యార్థినీలు కళశాల నుంచి చీలురోడ్డు సెంటర& వరకు ర్యాలీ నిర్వహించి మేరా భారత్ మహాన్ అంటూ నినదించారు. భరతమాత పులకరించేలా అంతరిక్షంలో జరిగిన అద్భుతం ఇస్రో పంపిన వ్యోమ నౌక చంద్రయాన్ 3 జాబిల్లి దక్షిణ ధ్రువం మీద అడుగు పెట్టడం భారతదేశం గర్వించదగ్గ విషయం అన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ ఐ హరిత, ఎన్.ఎస్.ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్స్ కే.కృష్ణకుమారి, జి కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.

మురకుండపాడులో ఆర్డీవో పర్యటన

విశాలాంధ్ర - బాపట్ల రూరల్ : బాపట్ల మండలం మురకుండపాడు గ్రామంలో విషజ్వరాల పరిస్థితిపై ఆర్డీవో రవీందర్ అధికార బృందంతో కలిసి పర్యటించారు. గ్రామంలో ప్రజలను విచారించి వైద్యశాఖ,పంచాయతీ రాజ్ శాఖల అధికారులకు పలు సుచనలు చేశారు. వ్యక్తిగత పరిశుభ్రత ప్రతి ఒక్కరూ పాటించాలని పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఆర్డీవోతో పాటు జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి విజయమ్మ,జిల్లా పంచాయతీ అధికారి రాంబాబు,డీఎల్పీవో పులి శరత్‌బాబు, తహశీల్దార్ సుధారాణి, గ్రామీణ మంచినీటి సరఫరా అధికారి మంజుర్ భాష తదితరులున్నారు.

బాసిత్‌కు వేజెండ్ల ఆర్థిక సాయం

విశాలాంధ్ర - బాపట్ల : పట్టణంలోని 6వ వార్డు జమేదార్ పేటలో వి3 న్యూస్ విలేఖరి షేక్ అబ్దుల్‌బాసిత్ కొన్ని రోజులగా అనారోగ్యంతో భాదపడుతున్నారు. విషయం తెలుసుకున్న సహచర విలేకరి వేజెండ్ల శ్రీనివాసరావు వైద్య ఖర్చులు నిమిత్తం రూ. 5 వేలు గురువారం అందజేశారు.ఈ సందర్భంగా వైసీపీ దివ్యాంగుల జిల్లా నాయకుడు చల్లా రామయ్య మాట్లాడుతూ అబ్దుల్‌బాసిత్‌కు ప్రతి ఒక్కరూ మానవత్వంతో ఆర్థిక సహాయం అందజేయాలని కోరారు.

ఖాళీ పోస్టులు త్వరలో భర్తీ

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : ప్రభుత్వ ప్రభుత్వ సమగ్ర (జీజీహెచ్)ఆసుపత్రిలోని కుటుంబ సంక్షేమ విభాగంలో ఖాళీగా ఉన్న పోస్టులను త్వరలో భర్తీ చేయనున్నట్లు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ తెలిపారు. ఆసుపత్రిలోని కుటుంబ సంక్షేమ విభాగంలో ఓపీ సేవలను ఆయన గురువారం పర్యవేక్షించారు. ఈ సందర్భంగా డాక్టర్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ ఆసుపత్రిలో ప్రతి విభాగాన్ని తనిఖీలు చేస్తున్నప్పుడు అనేక లోపాలు గుర్తిస్తున్నామని, ప్రతి చోట సమస్యలు కనపడుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విభాగంలో 10 పోస్టులు ఖాళీగా ఉన్నట్లు గుర్తించామని, అందులో నలుగురు వైద్యుల పోస్టులు ఖాళీగా ఉన్నాయని, వీటిని భర్తీ చేసేందుకు హెచ్‌డిఎస్ చైర్మన్, జిల్లా కలెక్టర్, డీఎంఈకు ప్రతిపాదనలు పంపిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఒక డాక్టర్‌కు ఆరోగ్యం సరిగా లేకపోవడంతో ఈహెచ్‌ఎస్ విభాగంలో పని చేస్తున్నారని, మరో వైద్యుడు డాక్టర్ గురు ప్రసాద్ మంగళగిరి నుంచి వస్తూ పదేపదే గైర్హాజరవుతున్నట్లు ఆగ్రహం వ్యక్తంచేశారు. కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సలను రోజుకు 10 నుంచి 15 ఆపరేషన్లు చేయాలన్నారు. తల్లీబిడ్డల కోసం వాహనం పంపిస్తున్న మాదిరిగా ట్యూబెక్టమి చేసిన వారికి కూడా వాహనం పంపించే విధంగా చర్యలు తీసుకుంటామని ఆయన చెప్పారు. ఈ విషయాన్నీ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుని వెళ్లినట్లు ఆయన చెప్పారు. సూపరింటెండెంట్ వెంట సివిల్ సర్జన్ ఆర్ఎంఓ డాక్టర్ సతీష్ కుమార్, నర్సింగ్ సూపరింటెండెంట్ ఆశా సజని ఉన్నారు.

విశాలాంధ్ర బాపట్ల జిల్లా

పంటనష్టం అవకతవకలపై విచారణ

విశాలాంధ్ర -రేపల్లె : మొక్కజొన్న పంటనష్టం నమోదులో అవకతవ కలు జరిగాయని అంది న ఫిర్యాదుల మేరకు విచారణ చేపట్టినట్లు జిల్లా డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ యం. విజయ నిర్మల తెలిపారు. మండలంలోని బేతపూడి గ్రామ సచివాలయంలో గురువారం రైతులను, అధికారులను విచారిస్తున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా విచారణాధికారి విజయ నిర్మల మాట్లాడుతూ. 2023 ఎప్రియల్, మే నెలల్లో కురిసిన అకాల వర్షాలతో ఈ ప్రాంతంలో వేసిన మొక్కజొన్న పంటకు కొంత మేర నష్టం వాటిల్లిందని అన్నారు. పంటనష్టం జరిగిన రైతులను నమోదు చేసేందుకు ప్రభుత్వం కొన్ని మార్గదర్శకాలు జారీ చేసిందని చెప్పారు. ఈ క్రాఫ్ నమోదు చేసుకున్న రైతుల పంటలకు నష్టం జరిగితే నమోదు చెయ్యాలని, పంటనష్టం జరిగిన పొలములో సంబంధిత రైతుతో ఫోటోలు తీసి నష్టపరిహారం నమోదు చెయ్యాలనే నిబంధనలు ఉన్నాయన్నారు. మండల వ్యవసాయ శాఖ అధికారులు నిబంధనలు పాటించ కుండా అనర్హులైన వారితో, పొలము లేకున్నా, ఈక్రాపు నమోదు లేకున్నా నమోదు చేశారని, నిజమైన పంటనష్టం జరిగిన రైతుల పేర్లు నమోదు చెయ్యలేదనే ఫిర్యాదులు అందటంతో విచారణ చేస్తున్నట్లు తెలిపారు. ఈ మేరకు మండల వ్యవసాయ అధికారులను, రైతుల వద్దనుండి లిఖిత పూర్వక ఫిర్యాదులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. విచారణ పూర్తి అయిన తరువాత జిల్లా వ్యవసాయ శాఖ అధికారికి నివేదిస్తామని చెప్పారు. కార్యక్రమంలో చీరాల వ్యవసాయ సహాయ సంచాలకులు ఎప్రాయిము రైతులు పాల్గొన్నారు.

ఎన్‌సీసీ 22ఏ బెటాలియన్ ట్రూప్ ప్రారంభం

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : పట్టణంలోని అక్బర్‌పేట డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ గురుకులంలో ఆంధ్ర బెటాలియన్ సుబేదార్ మజార్ మనోజ్ ఎన్‌సీసీ కార్యాలయంలో గురువారం ప్రారంభించారు. విద్యార్థినిలు ఉద్దేశించి మాట్లాడుతూ చక్కటి క్రమశిక్షణ, దేశభక్తిని పెంపొందించుతూ దేశానికి మంచి పేరు తీసుకురావాలన్నారు. పాఠశాలకు, తల్లిదండ్రులకు మీరే గర్వకారణం కావాలని ఉపన్యాసించారు. ప్రిన్సిపల్ భవానీదేవి మాట్లాడుతూ విద్యార్థినీలు క్రమశిక్షణ, క్రీడలలో రాణిస్తున్న విధానం వల్ల పాఠశాలను ఎన్నుకోవడం జరిగిందన్నారు. ఎన్‌సీసీ కార్యాలయం పాఠశాలలో ప్రారంభం చేయడం ఒక వరం అన్నారు. ఎన్‌సీసీ గ్రూప్‌ని పాఠశాలకు వచ్చేందుకు కృషి చేసిన ఉమాశంకర్‌కి విద్యార్థినులు ఉపాధ్యాయ బృందం కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిస్టిక్ కోఆర్డినేటర్ కె.పద్మజ, ఎన్‌సీసీ చీఫ్ ఆఫీసర్ కత్తి శ్రీనివాసరావు, జెసిఓ జ్యోతిసింగ్, శివఆనంద్, కోటేశ్వరి, పిఈటి శాంతకుమారి, వైస్‌ప్రిన్సిపాల్ ఎం.కురుద్‌మేరీ, జ్ఞాన ప్రసూనాంబ, ఉపాధ్యాయులు, విద్యార్థినిలు పాల్గొన్నారు.

‘ఆమంచిపై ఆరోపణలు సహేతుకం కాదు’

విశాలాంధ్ర - పర్చూరు : వైసీపీ ఇంచార్జీ ఆమంచి కృష్ణమోహన్‌పై టీడీపీ నాయకులు చేస్తున్న ఆరోపణలు సహేతుకం కాదని వైసీపీ నాయకులు తెలిపారు. స్థానిక వైసీపీ కార్యాలయంలో గురువారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వైసీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు మాట్లాడుతూ అవినీతి అక్రమాలతో టిడిపి విజయం సాధిస్తుందని, నీరు చెట్టు పథకంలో ధనార్జనే ధ్యేయంగా పాలన సాగించారని వారు విమర్శించారు. అక్రమంగా ఓటర్లను చేర్చి ఎన్నికలలో గెలుపొందుతున్నారని వాటిపై ఆమంచి అక్రమ ఓట్లు ఉన్న తొలగించాలని దరఖాస్తులు సమర్పిస్తే వాటిపై అవాకులు చవాకులు పేలుతున్నారని, సక్రమమైన ఓట్లను తొలగించరని, అక్రమమైన వాటినే తొలగిస్తారని తెలిపారు. ప్రజాస్వామ్యయుతముగా, ఎన్నికల నిబంధనలు పాటించాలని తెలుపుతూ అక్రమ ఓట్లపై విచారణలో నిరూపించుకోవాలని, లేనిచో స్వచ్ఛందంగా ఓట్లను తొలగించుకోవాలని, ఆ విధంగా చేయనీయెడల చట్ట ప్రకారం చర్యలు ఉంటాయని వైసీపీ నాయకులు తెలిపారు. ఓటు హక్కును సక్రమంగా సద్వినియోగం చేసుకోవాలని ఓటర్లకు తెలిపారు. కార్యక్రమం లో వైసీపీ నాయకులు కోట హరిప్రసాద్, ముప్పాళ రాఘవయ్య, షేక్ కాలీషా వలి, తోకల కృష్ణమోహన్, దండా చౌదరి, తిరుమలేశ్వరావు, రామకృష్ణ, మల్లా శ్రీనివాసరావు, కోట శ్రీనివాసరావు, ఎంపీటీసీ వీరయ్య,పేరం సుబ్బారావు, జంగా అనిల్, లంకా శివ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీతోనే ప్రజలు

విశాలాంధ్ర - చీరాల రూరల్ : రాష్ట్రంలోని ప్రతి ఒక్కరూ తెలుగుదేశం పార్టీతోనే ఉన్నారని తెదేపా నాయకులు అన్నారు. వైకాపా ప్రభుత్వంపై అసంతృప్తితో ఉన్నారని అన్ని వర్గాల ప్రజలు వైకాపా ప్రభుత్వంలో ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. తెలుగుదేశంపార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు మహానాడులో మినీ మేనిఫెస్టో మహాశక్తిని విడుదల చేయగా నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్చార్జి ఎం.ఎం. కొండయ్య ఆదేశానుసారం మ్యానిఫెస్టోలో పొందుపరచిన పథకాలను మండలంలోని విజయనగర్‌కాలని పంచాయతీ ఇంటింటికి తిరిగి కరపత్రాలను అందించి పథకాలను గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో తెదేపా నాయకులు, కార్యకర్తలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

ధృవీకరణ పత్రాలు తప్పనిసరి

విశాలాంధ్ర - కర్లపాలెం : వాహనదారులు ధృవీకరణ పత్రాలు తమవెంట తప్పక ఉంచుకోవాలని ఎస్సై శివయ్య తెలిపారు. కర్లపాలెం - బాపట్ల రోడ్డులోని ముకుందా టీస్టాల్ సమీపంలో గురువారం వాహన తనిఖీ నిర్వహించారు. ద్విచక్రవాహ నదారులు తప్పక హెల్మెట్ తప్పనసరిగా పెట్టుకోవాలని సూచించారు. పరిమితికి మించి ఆటోలో ప్రయాణికులు ఉంటే ఆటో సీజ్ చేస్తామని హెచ్చరించారు.